
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 18 జూలై 2024



ముగ్గురు ఆర్డీవోల చుట్టూ

ఓటరు జాబితా వివాదం

- ప్రైవేటు కార్యాలయాల నుంచీ చంద్రగిరి ఓటర్ల చేర్పులు, తొలగింపులు
- తహసీల్దార్లు, బీఎల్వోల లాగిన్ ఐడీలన్నీ వైసీపీ నేతలకు అప్పగింత
- ఓ ప్రైవేటు విద్యా సంస్థ విద్యార్థుల ప్రమేయం
- విచారణకు ప్రత్యేకాధికారిని నియమించే అవకాశం



తిరుపతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితాలో అక్రమాలు జరిగాయని ఎన్నికలకు ముందు నుంచీ టీడీపీ వర్గీయులు గగ్గోలు పెడుతున్న వ్యవహారంలో ముగ్గురు డిప్యూటీ కలెక్టర్ల పేరు తెరమీదకు వస్తున్నాయి.గత ఐదేళ్లలో ఎక్కువ కాలం పాటు తిరుపతి ఆర్డీవోగా కనక నరసారెడ్డి పనిచేశారు. ఆయన గతేడాది సెప్టెంబరులో బదిలీ కావడంతో తర్వాత ప్రస్తుత ఆర్డీవో నిశాంత్ రెడ్డి ఆ స్థానంలో నియమితులయ్యారు. 2017-18 మధ్య తిరుపతి రూరల్ తహసిల్దారుగా పనిచేసిన మీసాల కిరణ్‌కుమార్ ఆ సమయంలో అప్పటి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డికి సన్నిహితంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. అప్పటి నుంచే 2024 ఎన్నికల్లో వైసీపీ గెలుపుకోసం అనుకూలంగా ఓటర్ల జాబితాను రూపొందించేందుకు ప్రణాళిక వేసినట్టు టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. తర్వాత డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి రాగా చెవిరెడ్డికి ఓఎస్డీగా నియమితులయ్యారు. తర్వాత గూడూరు ఆర్డీవోగా బదిలీ అయ్యారు. గూడూరు ఆర్డీవోగా పనిచేస్తూ కూడా తరచూ చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితా తయారీలో జోక్యం చేసుకున్నారని, దాదాపు ఆయనే పర్యవేక్షించేవారని చంద్రగిరి టీడీపీ ఇంచార్జి పులివర్తి నానీ ఎన్నికల ముందు ఈసీకి, ప్రభుత్వానికి అసంఖ్యాక ఫిర్యాదులు చేశారు. తిరుపతి ఆర్డీవోగా కనకనరసారెడ్డి కూడా చెవిరెడ్డికి అనుకూలంగా వ్యవహరించారని, ఆయన తర్వాత వచ్చిన ప్రస్తుత ఆర్డీవో నిశాంత్‌రెడ్డి కూడా అదే పంథా అవలంబించారని ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో చంద్రగిరి ఓటరు జాబితాలో బోగస్ ఓటర్ల చేర్పులు, టీడీపీ అనుకూల ఓటర్ల తొలగింపులకు వీరిదే ప్రధాన బాధ్యత అని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.

తిరుపతి, బెంగళూరు నుంచీ మార్పుచేర్పులు

తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి ప్రైవేటు కార్యాలయం నుంచీ ప్రధానంగా ఓటర్ల జాబితా మార్పుచేర్పులు జరిగాయని టీడీపీ నేతలు ఫిర్యాదుల్లో ఆరోపించిన విషయం తెలిసిందే. అక్కడ చెవిరెడ్డి వద్ద పీఆర్వోగా పనిచేసిన ఓ రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ పాత్ర కూడా కీలకమని ఫిర్యాదుల్లో ఆరోపించారు. అలాగే బెంగళూరులో ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపార భాగస్వాముల కార్యాలయాల నుంచీ ఈ పనులు జరిగాయని తాజా ఫిర్యాదుల్లో ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసిల్దార్లు, బీఎల్వోలు, ఆర్డీవో కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసిల్దారు లాగిన్ ఐడీలు, పాస్ వర్డులను ఈ రెండు ప్రైవేటు కార్యాలయాల సిబ్బందికి అందజేశారని, వాటి ఆధారంగా బోగస్ ఓటర్లను భారీ ఎత్తున చేర్పించడం, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించడం జరిగిందని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. జాబితాలో చేర్పులు, తొలగింపుల వ్యవహారం చేపట్టడానికి తిరుపతిలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థ విద్యార్థులను వినియోగించారని, ఆ సంస్థ యజమాని అన్నమయ్య జిల్లా కలికిరి మండలానికి చెందిన వారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అందరినీ విచారించనున్న సీఐడీ అధికారులు

గత ఐదేళ్లలో తిరుపతి ఆర్డీవోలుగా పనిచేసిన కనకనరసారెడ్డి, నిశాంత్‌రెడ్డిలతో పాటు గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌ను సీఐడీ అధికారులు విచారించనున్నారు. అలాగే ఆరు మండలాల తహసిల్దార్లు, బీఎల్వోలు, కంప్యూటర్ ఆపరేటర్లు, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్, ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన విద్యార్థులను కూడా ప్రశ్నించనున్నట్టు సమాచారం. ముఖ్యంగా గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ కాల్ డేటాను పరిశీలించాలని టీడీపీ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్న నేపథ్యంలో దానిపైనా దృష్టి సారించే ఆస్కారం వుంది. తిరుపతిలోని చెవిరెడ్డి ప్రైవేటు కార్యాలయానికి ఆయన తరచూ రావడం, ఆరు మండలాల తహసిల్దార్లను అక్కడికి పిలిపించుకోవడం వంటి వాటికి సంబంధించి సీసీ కెమెరాల ఫుటేజీలు కూడా తమ వద్ద వున్నాయని టీడీపీ నేతలు చెబుతున్నారు. కాల్ డేటాను కూడా విశ్లేషించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అందువల్ల సీఐడీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

ప్రత్యేకాధికారి నియామకానికి

సీఎం చొరవ

తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల సందర్భంగా తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో వెలుగు చూసిన ఓటరు కార్డుల అక్రమ డౌన్‌లోడింగ్, నకిలీ ఓటరు కార్డుల తయారీ వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న చంద్రబాబు గత ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితా అక్రమాలు కూడా తెలియడంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు సమాచారం. ఈ రెండు అంశాలను కేస్ స్టడీలుగా తీసుకుని భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడా పునరావృతం కాకుండా చూడాలని భావిస్తున్నట్టు తెలిసింది. అందులో భాగంగా తిరుపతి, చంద్రగిరి ఓటర్ల జాబితాల అక్రమాలపై లోతుగా విచారణ జరిపించేందుకు ప్రత్యేకాధికారిని నియమించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు టీడీపీ వర్గాల ద్వారా తెలిసింది.వైసీపీ నేతలు చాలా తెలిగ్గా తీసుకుని ఓటర్ల జాబితాలో ఇష్టానుసారం అక్రమంగా మార్పుచేర్పులు చేయించారని, అయితే తాజాగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పరిణామాలు ఆషామాషీగా వుండవని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఓటర్ల జాబితా అక్రమాలకు బాధ్యులైన వారిపై తీవ్రస్థాయి చర్యలే వుంటాయని చెబుతున్నాయి. దీన్నిబట్టి రానున్న రోజుల్లో తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు సంభవించే అవకాశాలున్నాయని భావించాల్సి వస్తోంది.




రుయాస్పత్రి ఆవరణలో మహాప్రస్థానం వాహనాలు - మృతదేహాన్ని ప్రైవేటు వాహనంలో తీసుకెళ్తున్న బాధితులు

కాసులిస్తేనే కదుల్తాం

'మహా ప్రస్థానం'లో మృతదేహం తరలింపునకు రూ. 4 వేల డిమాండ్

తిరుపతి(వైద్యం), జూలై 17 : రుయాస్పత్రిలో రోగి డిశ్చార్జి అయ్యేలోపు అన్నింటికీ చేతులు తడుపుతూ బయట పడటం సాధారణమైపోయింది. ఆఖరుకు మృతదేహాల తరలింపులోనూ దయ చూపడం లేదనడానికి తాజా సంఘటనే ఉదాహరణ. చిట్టమూరు మండలం యాకసిరికి చెందిన జె.వెంకటయ్య(57) రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. స్వగ్రామానికి మృతదేహాన్ని ఉచితంగా తీసుకువెళ్లేందుకు ఆస్పత్రిలో అంబులెన్సులు (మహాప్రస్థానం) ఉన్నాయని తెలుసుకొని వెంకటయ్య కుటుంబ సభ్యులు సంప్రదించారు. వాహనం ఉచితమే గాని శుభ్రత, డీజల్, డ్రైవరుకు కలిపి రూ.4 వేలు చెల్లించాలని వాహనాల నిర్వాహకులు చెప్పారు.అంత స్థోమత లేదని, ఊరిలో ఎవరినైనా అడిగి రూ.2 వేలు ఇవ్వగలమని ప్రాధేయపడ్డా కుదరదని నిర్వాహకులు తెగేసి చెప్పారు.దీంతో గత్యంతరం లేక సమీప బంధువు సాయంతో ఓ ప్రైవేటు వాహనంలో మృతదేహాన్ని తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో వారం రోజులపాటు ప్రతి చిన్న పనికీ డబ్బులు ముట్టజెప్పాల్సి వచ్చిందని వారు కన్నీరు మున్నీరయ్యారు.మహాప్రస్థానం వాహన నిర్వాహకు లు అందిన కాడికి దోచుకోవడంపై పలుమార్లు బాధితులు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతోంది. ఏఆర్ఎంవో హరికృష్ణను ఈ విషయమై వివరణ కోరగా మహా ప్రస్థానం వాహనాల్లో మృతదేహాలను ఉచితంగానే తీసుకువెళ్లాలన్నారు.నగదు తీసుకుంటే తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొటాల సమీపంలో చిరుత సంచారం

రాత్రి వేళ పొలాల వద్దకు రైతులు వెళ్లొద్దని అటవీ శాఖ అధికారుల సూచన

చంద్రగిరి, జూలై 17: చంద్రగిరి మండలం కొటాల గ్రామ సమీపంలో ఓ చిరుత పులి సంచరిస్తోంది.జగనన్న కాలనీ వెనుకభాగంలో ఉన్న గుట్టలో మంగళవారం సాయంత్రం చిరుత సంచరిస్తోందని తెలిసిన జగనన్న కాలనీ వాసులు, కొటాల, పుల్లయ్యగారిపల్లె, నారావారిపల్లె, ఎ.రంగంపేట గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. గుట్టలో పెద్ద బండరాతిపై చిరుత పులిని గమనించిన జనం వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. రాత్రి సమయంలో కూడా చిరుత పులి బండరాతిపైనే ఉండడంతో జగనన్న కాలనీవాసులు బాణా సంచి కాల్చి, డప్పులు వాయించారు. అటవీ సిబ్బంది జగనన్న కాలనీతో పాటు, కొటాల, పుల్లయ్యగారిపల్లె, ఎ.రంగంపేట, నారావారిపల్లె గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రైతులు రాత్రి వేళ పొలాల వద్దకు వెళ్లవద్దని సూచించారు.పనపాకం ఎఫ్ఆర్వో మాధవి మాట్లాడుతూ తమ సిబ్బందితో జగనన్న కాలనీ వద్ద చిరుత సంచారంపై నిఘా వుంచనున్నట్లు తెలిపారు. కెమెరా ట్రాప్స్ ద్వారా చిరుత సంచారం కనిపెట్టి, బోన్లు ఏర్పాటు చేస్తామన్నారు.



గుట్టలో బండరాయిపై చిరుత పులి ←

టీటీడీ అధికారుల అత్యుత్సాహం

పొగాకు ఉత్పత్తులు సీజ్ చేయడంపై తిరుచానూరు వ్యాపారుల ఆగ్రహం

తిరుచానూరు, జూలై 17:మాంసం, పొగాకు విక్రయాల నిషేధంపై ముందస్తుగా నోటీసులు కూడా ఇవ్వకుండా టీటీడీ అధికారులు సరుకు స్వాధీనం చేసుకోవడం తిరుచానూరులో విమర్శలకు దారితీసింది. వారం రోజుల క్రితం హిందూ సంఘాలు తిరుచానూరులో మాంసం , పొగాకు ఉత్పత్తులు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని టీటీడీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మాంసం, పొగాకు ఉత్పత్తులు అమ్మకుండా మాడవీధుల్లో వ్యాపారులకు అవగాహన కల్పించాలని పంచాయతీ ఈవోకు టీటీడీ విజిలెన్స్ అధికారులు సూచించినట్లు సమాచారం.తరువాత పంచాయతీ సిబ్బంది మాడ వీధుల్లో ఉన్న షాపుల వద్దకు వెళ్లి సిగరెట్లు, బీడీలు విక్రయించరాదని చెప్పారు. పంచాయతీ నుంచి నోటీసులు ఇచ్చి, స్థానిక వ్యాపారులకు అవగాహన కల్పించాక పొగాకు ఉత్పత్తులపై నిషేధం అమల్లోకి తెచ్చివుంటే బాగుండేది.అలా కాకుండా టీటీడీ ఎస్టేట్ విభాగంలో తహసీల్దారు లలితాంజలి, ఏవీఎస్వో సతీష్‌కుమార్, పంచాయతీ అధికారులు బుధవారం ఉదయం ఆలయ మాడవీధుల్లోని దుకాణాల్లో తనిఖీలు చేశారు.దుకాణాల్లో వున్న సిగరెట్లు, బీడీలను వెలుపల వేసి మూటకట్టి శ్రీవారి సేవకుల ద్వారా విజిలెన్స్ కార్యాలయానికి తీసుకెళ్లారు.దీంతో దుకాణదారులంతా అక్కడికెళ్లి ముందస్తు సమాచారం లేకుండా అంగళ్లలో సరుకును ఎలా తీసుకెళ్తారంటూ గట్టిగా ప్రశ్నించారు. పొగాకు ఉత్పత్తులు విక్రయించవద్దని నోటీసులు ఎప్పుడైనా ఇచ్చారా.. లేదా సమావేశం పెట్టారా.. పోనీ నిషేధం ఏమైనా ఉందా...మీ దగ్గర ఏవైనా ఉత్తర్వులున్నాయా అని ప్రశ్నించడం మొదలెట్టారు.దీంతో వారికి సమాధానం చెప్పలేక తీసుకెళ్లిన పొగాకు ఉత్పత్తులను తిరిగి దుకాణదారులకు ఇచ్చేశారు.



దుకాణాల్లో సిగరెట్ ప్యాకెట్లను తరలిస్తున్న టీటీడీ అధికారులు

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

తిరుపతి జిల్లాకు రానున్న 42మంది

తిరుపతి(కలెక్టరేట్), జూలై 17: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలో పనిచేస్తున్న 42మంది తహసీల్దార్లను గుంటూరు, ప్రకాశం జిల్లాలతో పాటు రాయలసీమ జిల్లాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయా జిల్లాల్లో పనిచేస్తుండిన తహసీల్దార్లను తిరుపతి జిల్లాకు పంపించింది.ఆయా జిల్లాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లను తిరిగి పాత జిల్లాలకు బదిలీ చేసేందుకు సంబంధించి సీఎం చంద్రబాబు బుధవారం ఆమోదముద్ర వేశారు. జీవో రాగానే పలువురు తహసీల్దార్లు వారి పాత జిల్లాలకు వెళ్లనున్నారు.ఎన్నికల సమయంలో ఇక్కడినుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన 42మంది తహసీల్దార్లు తిరిగి రానున్నారు.జిల్లాలోని పలు కీలకమైన మండలాలకు ఆర్డర్స్ వేయించుకునేందుకు తహసీల్దార్లు రాజకీయ నేతలను ఆశ్రయించినట్లు సమాచారం.

వైసీపీ పాలనలో లాక్కున్న భూములను తిరిగి

రైతులకే అప్పగిస్తాం

\- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి -



సోమల, జూలై 17: వైసీపీ పాలనలో లాక్కున్న భూములను తిరిగి రైతులకే అప్పగిస్తామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.చిత్తూరు జిల్లా సోమల మండలం కమ్మపల్లెలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనే అత్యధికంగా పుంగనూరు నియోజకవర్గంలో భూ ఆక్రమణలు, రైతులపై దాడులు, టీడీపీ వారిపై అక్రమ కేసుల నమోదు జరిగాయన్నారు. దౌర్జన్యపూరితమైన పాలనకు భయపడి రైతులు మౌనంగా ఉండిపోయారన్నారు.భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆ తర్వాత రెండింతల ధరకు ప్రభుత్వానికే వైసీపీ నేతలు విక్రయించారన్నారు.

తిరుపతి బస్టాండ్‌లో 16కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి(ఆర్టీసీ), జూలై 17: తిరుపతి సెంట్రల్ బస్సు స్టేషన్‌లో మంగళవారం అర్ధరాత్రి 16 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చెన్నై ప్లాట్‌ఫామ్ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా ఆర్టీసీ బీట్ కానిస్టేబుల్స్ ఎన్డీ రెడ్డి, ఎంజీడీ బాబు, అవుట్‌పోస్ట్ ఏఎస్ఐ హేమలత, కానిస్టేబుల్ త్రినాథ్ గుర్తించారు. వారి బ్యాగులను సోదా చేశారు. 8ప్యాకెట్లలో 16కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని నిందితులను ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులు చెన్నైకి చెందిన అముల్‌రాజ్‌భరత్, రామలింగ బాలాజీలుగా గుర్తించారు. వీరిపై కేసు నమోదుచేశారు.



గంజాయితో పట్టుబడ్డ రామలింగం బాలాజీ, అముల్‌రాజ్ భరత్

రక్తతర్పణం



తూగుండ్రం హైస్కూల్ మలుపువద్ద చాకులు, బ్లేడ్లతో కొట్టుకుంటూ రక్తం చిందిస్తున్న షియా ముస్లింలు

మొహర్రం సందర్భంగా బుధవారం జిల్లాలోని షియా ముస్లింలు పీర్లు ఊరేగించి, రక్తతర్పణం(అజాదారిమాతం) నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మహమ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్, వారి కుటుంబీకులు, బంధువులు, అనుచరుల ప్రాణాలను అప్పటి పాలకుడు యజీద్ బలిగొన్నాడు. అలా ప్రాణాలు అర్పించిన వీరి కోసం శోకతప్త హృదయంతో రక్తతర్పణం చేపట్టారు. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలో మొహర్రం సందర్భంగా 10వరోజు అంజుమన్ అబ్బాషియా కమిటీ, అబ్బాషియా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మతగురువులు మౌలానా అబుదాలి, నబీల్ మీర్జా అధ్యక్షత వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు పలువురు నల్లదుస్తులు ధరించి అబ్బాషియా అసుఖానాలో ప్రార్థనలు చేశారు. ఆవలకొండ తూగుండ్రం హైస్కూల్ మలుపు, తూగుండ్రం ఫకీర్‌తోట వరకు ర్యాలీ నిర్వహించారు. పలువురు చిన్నారులు, యువకులు, పెద్దలు పదునైన చాకులు, బ్లేడ్లతో తమ ఛాతీ, వీపుపై కొట్టుకుంటూ రక్తతర్పణం నిర్వహించారు. రక్తం చిందిస్తున్న వారిపై నీళ్ల చల్లుతుండగా.. తారురోడ్డుసైతం ఎరుపెక్కింది. తూగుండ్రం ఫకీర్‌తోటవద్ద గల అగ్నిగుండం చుట్టు షియా ముస్లిమ్‌లు పీర్లతో ఊరేగింపుగా తిరిగారు. అక్కడా రక్తతర్పణం గావించి ప్రార్థనలు చేసి మొక్కులతో ముగించారు. ఈ సందర్భంగా చిత్తూరు తాలుకా సీఐ కుళ్లాయప్ప, ఎస్ఐలు రామాంజనేయులు, ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ పీర్లు ఊరేగింపులో వివిధ ప్రాంతాల నుంచి షియా ముస్లింలు తరలివచ్చారు. అంజుమన్ అబ్బాసియా కమిటి చైర్మన్ ఎస్.హెచ్.నియాజ్‌అలీ, అబ్బాసియా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గులాంహుస్సేన్, వైస్ ప్రెసిడెంట్ ఇక్బాల్ హుస్సేన్, కార్యదర్శి రహమత్ అలీ, కోశాధికారి షాకీర్ అలీ, స్థానిక షియా ముస్లింలు పాల్గొన్నారు.

\- గంగాధరనెల్లూరు





తిరుమల ఆలయం ముందు కొల్లు రవీంద్ర, పక్కనే తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ - కేంద్రమంత్రి ఎస్పీ సింగ్ - ఆర్ కృష్ణయ్య

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి ఎస్పీ సింగ్ బఘేల్, బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, తెలంగాణ మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యే ఆదినారాయణ ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.15 కోట్లు

తిరుమల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.15 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 71,409 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,128 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరి



నితిన్ గడ్కరికి స్వాగతం పలుకుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి నితిన్ గడ్కరి శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమల వచ్చారు. వకుళామాత గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ఆయనకు టీటీడీ ఈవో శ్యామలరావు స్వాగతం పలికి బస ఏర్పాట్లు చేశారు. కాగా, కేంద్రమంత్రి నితిన్ గడ్కరి గురువారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

భువనేశ్వరిని కలిసిన ఎమ్మెల్యే



భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాని

చంద్రగిరి, జూలై 17: ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీ నారా భువనేశ్వరిని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం భువనేశ్వరి చంద్రగిరి మండలం కాశిపెంట్లలోని హెరిటేజ్ ఫ్యాక్టరీకి విచ్చేశారు. తిరుపతి రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, శ్రీధర్ నాయుడు, అనిమినేని మధు, నంగా బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంబీయూలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



ఎంబీయూ ప్లేస్‌మెంట్ టీమ్‌తో మోహన్‌బాబు

చంద్రగిరి, జూలై 17: చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో బుధవారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. టీసీఎస్ కంపెనీ నుంచి 175మంది ప్యానలిస్టులు హాజరయ్యారు.

పురోహితుల సంఘం గౌరవాధ్యక్షుడిగా శివకుమార్ శర్మ



చంద్రగిరి, జూలై 17: రాష్ట్ర పురోహితుల బ్రాహ్మణ సమాఖ్య ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడిగా చంద్రగిరిలోని శ్యామలా సమేత మల్లేశ్వరాలయం అర్చకులు డాక్టర్ శివకుమార్ శర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం పలమనేరులో జరిగిన పురోహితుల సంఘ సమావేశంలో ఉమ్మడి జిల్లా పురోహితుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ శివకుమార్ శర్మను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ పురోహితుల బ్రాహ్మణ సమాఖ్య అభివృద్ధికి, ఉమ్మడి జిల్లా బ్రాహ్మణ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ పదవికి తనను ఎన్నుకున్నందుకు పురోహితుల సంఘం రాష్ట్ర నాయకులు, ఉమ్మడి జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు చంద్రగిరి మండల సమావేశం

చంద్రగిరి, జూలై 17: చంద్రగిరి మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటసూర్యసాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరవుతారని అన్నారు. మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకాగలరని ఎంపీడీవో పేర్కొన్నారు.

మహాభారత ఉత్సవాలకు శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న దృశ్యం - ప్రత్యేక అలంకారంలో ద్రౌపదీ దేవీ

రామచంద్రాపురం, జూలై 17: మండలంలోని పరమాల మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. ద్రౌపదీ సమేత ధర్మరాజుల మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. వేకువజామున వేద మంత్రోచ్ఛరణల మధ్య సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్‌స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం మేళతాళాల నడుమ ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆలయ ధర్మకర్త రమేష్ నాయుడు, సురేంద్ర నాయుడు, రోశిరెడ్డి, రవి పాల్గొన్నారు.

వైభవంగా గంగజాతర



పిడతల గంగమ్మ

రామచంద్రాపురం, జూలై 17: మండలంలోని పీవీ పురంలో బుధవారం గంగజాతర వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి అమ్మవారి ప్రతిరూపమైన ఘటం కుండ పంబల వాయిద్యాల నడుమ ఇంటింటా పూజలు అందుకుంది. బుధవారం వేకువజామున పిడతల గంగమ్మ మట్టి ప్రతిమ తయారు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అమ్మవారిని మేళతాళాల నడుమ ఊరేగించి నడివీధిలో ప్రతిష్ఠించారు. అమ్మవారికి గ్రామస్థులు వేట పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం గ్రామబలి కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్దఎత్తున తరలిరాగా, గ్రామస్థులు తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుమలకు తెలుగు తమ్ముళ్ల పాదయాత్ర

ఎర్రావారిపాలెం, జూలై 17: చంద్రగిరి కోటపై టీడీపీ జెండా ఎగురవేసిన పార్టీ శ్రేణులు వెంకటేశ్వర స్వామికి తమ మొక్కును చెల్లించేందుకు బుధవారం కోలాహలంగా తిరుమల కొండకు పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. ఎర్రావారిపాలెం మండలంలో మాజీ జడ్పీటీసీ బొమ్మన కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శ్రీనివాసుడి దర్శనానికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, నాయకులు కేశవుల నాయుడు, వెంకటశివరామిరెడ్డి, దేవి, రెడ్డెప్ప, మురళి, హరిశ్చంద్ర, చిన్నపరెడ్డి, శిరివేలు రఘునాథ, మహేష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



తిరుమలకు పాదయాత్రగా బయల్దేరిన తెలుగు తమ్ముళ్లు

లడ్డూల నాణ్యతపై టీటీడీ దృష్టి

● 160 గ్రాములకు తగ్గకుండా చూడాలని ఈవో ఆదేశం





తిరుమల, జూలై17(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు ప్రీతిపాత్రమైన లడ్డూల నాణ్యతపై టీటీడీ దృష్టి సారించింది. గత వైసీపీ ప్రభుత్వంలో అన్నప్రసాదాలతో పాటు లడ్డూల నాణ్యతపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీటీడీ ఈవోగా నియమితులైన శ్యామలరావు ఇప్పటికే అన్నప్రసాదాల నాణ్యతపై దృష్టిపెట్టారు. నిరంతరాయంగా సమీక్షలు నిర్వహిస్తూ అన్నప్రసాదాల నాణ్యత పెంపుపై కసరత్తు చేస్తున్నారు. లడ్డూలపై కూడా దృష్టిపెట్టిన ఆయన వాటి తయారీకి వినియోగించే ముడి సరుకుల నాణ్యత తగ్గకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పోటు కార్మికులతోనూ సమీక్షించి లడ్డూల తయారీలో ఇంకా శ్రద్ధ చూపాలని కోరారు. ప్రస్తుతం 3.3 లక్షల నుంచి 3.5 లక్షల లడ్డూలను టీటీడీ తయారు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే లడ్డూల తయారీని పెంచడంతో పాటు నాణ్యత విషయంలో రాజీపడకూడదని ఈవో ఆదేశించారు. భక్తులకు కోరినన్ని లడ్డూలు ఇచ్చే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే లడ్డూ 160 నుంచి 175 గ్రాముల బరువు ఉండేలా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 160 గ్రాములకు తగ్గకుండా చూడాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఆయన పలు మార్లు బూందీతయారీ కేంద్రం, లడ్డూల వితరణ కేంద్రాలను నేరుగా పరిశీలించి పలు సూచనలు చేశారు. బుధవారం సాయంత్రం కూడా లడ్డూలను భక్తులకు అందజేయడాన్ని పరిశీలించారు. కొంతమంది భక్తులతో నేరుగా మాట్లాడారు. లడ్డూల నాణ్యతలో మార్పు కనిపిస్తోందని, చాలా రుచిగా ఉండటంతో పాటు బరువు కూడా కరెక్ట్‌గా ఉందని భక్తులు చెప్పడంతో సంతృప్తివ్యక్తం చేశారు.

శ్రీవైష్ణవ బ్రాహ్మణులతోనే లడ్డూప్రసాదం తయారీ

శ్రీవారి లడ్డూ ప్రసాదాలను ఎన్నో దశాబ్దాల నుంచి శ్రీవైష్ణవ బ్రాహ్మణులు సంప్రదాయానుసారంగా తయారు చేస్తున్నారని టీటీడీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. 'తిరుమల శ్రీవారి పోటులో 980 మంది హిందూ మతానికి చెందిన కార్మికులు వివిధ విధులను నిర్వహిస్తున్నారు. వీరిలో శ్రీవైష్ణవ బ్రాహ్మణులు లడ్డూల తయారీ, ముడి సరుకులు తీసుకురావడం వంటి పనులు చేస్తారు. ఇతరులు లడ్డూలను తరలించడం, ఉగ్రాణం, పడి పోటు, లడ్డూ కౌంటర్లలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల సోషల్ మీడియా వేదికగా శ్రీవారి లడ్డూప్రసాదాలను థామస్ అనే కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో తయారు చేస్తున్నారని అసత్య ప్రచారాలు చేస్తున్నారు. కొన్ని సామాజిక మాధ్యమాలలో వస్తున్న ఇలాంటి అసత్య వార్తలను భక్తులు నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం' అని టీటీడీ ఆ ప్రకటనలో తెలిపింది. సోషల్ మీడియా వేదికగా టీటీడీపై అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించింది.

చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

87 గ్రాముల బంగారం, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పాకాల, జూలై 17: పాకాల, పూతలపట్టు మండలాలల్లో చోరీలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 87 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చంద్రగిరి ఇన్‌చార్జ్ డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. సీఐ శ్రీరాములు, ఎస్సైలు మహేష్‌బాబు, లోకేష్ కుమార్ మంగళవారం సాయంత్రం నేంద్రగుంట అండర్ బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో పెనుమూరు వైపు నుంచి రెండు ద్విచక్ర వాహనాల్లో నలుగురు వస్తూ పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించారు. వెంబడించి పట్టుకున్న పోలీసులు వీరు చోరీలకు పాల్పడుతున్న ముఠాగా గుర్తించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం వావిళ్లతోటకు చెందిన ఎన్.మురళి(21), ఎస్.బాబు(20), పెనుమూరు మండలం మఠంపల్లె హరిజనవాడకు చెందినహర్షవర్ధన్(22), గంగుపల్లెకు చెందిన ఎం.వరుణ్ కుమార్(22)లు చెడు వ్యసనాలకు బానిసలై ఒంటరిగా వున్న మహిళల మెడలో చైన్ స్నాచింగ్, తాళాలు వేసిన ఇళ్లలో చోరీలు చేయడం, గ్యాస్ సిలిండర్లు దొంగలించి విక్రయించి జల్సాలు చేసేవారు. గత నెల నేంద్రగుంట బస్టాపువద్ద ఓ మహిళ మెడలో బంగారు చైన్ లాక్కొని పారిపోతుండగా స్థానికులు గుర్తించి వెంట పడటంతో బైక్ వదిలేసి పారిపోయారు. పెనుమూరులో ఓ ఇంట్లో బంగారు దొంగతనానికి పాల్పడ్డారు. పూతలపట్టు వీర్ల గుడిపల్లె గ్రామంలో మే నెలలో 30 గ్రాముల బంగారు దొంగిలించారు. తవణంపల్లె కామలూరు దగ్గర ఓ వృద్ధురాలి మెడలో బంగారు చైను దొంగిలించారు. వీరి వద్ద నుంచి రూ.5లక్షల విలువైన 87 గ్రాముల బంగారు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జ్ డీఎస్పీ తెలిపారు. ఈ ముఠాను పట్టుకున్న పోలీసులను ఆయన అభినందించారు.







పుదిపట్లలో గాంధీపురం ఎదురుగా ఉన్న కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్, వ్యర్థాలు - తుమ్మలగుంటలో వరరూప అపార్ట్‌మెంట్ ముందు పడేసిన వ్యర్థాలు - ఉప్పరపల్లె రోడ్డులో కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

అధ్వానం... పారిశుధ్యం

● రోడుపక్కన కుప్పలుగా పడేసిన చెత్త, వ్యర్థాలు

● నిండిన మురుగు కాలువల్లో దుర్వాసన

తిరుపతి రూరల్, జూలై 17: తిరుపతి రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. రోడ్ల పక్కన ఎక్కడపడితే అక్కడ చెత్త, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఈ చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో ఆమార్గంలో వెళ్లే ప్రజలు ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. కుక్కలు, పశువులు ఈ వ్యర్థాలనే ఆహారంగా తీసుకుంటున్నాయి. అదే విధంగా కాలువల్లో ప్లాస్టిక్, చెత్తవ్యర్థాలు పేరుకుపోయి దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల పూడికతీత నిర్వహణ సరిగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల పంచాయతీల్లో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం కూడా నిర్వహించారు. అయినా ఈ వ్యర్థాల తొలగింపులో పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యాన్ని ప్రజలు ఎండగడుతున్నారు. తిరుపతిలోని ప్రధాన జాతీయ రహదారి పక్కన చెత్త, వ్యర్థాలు లేకుండా చూడాలని, ఎవరైనా పడేస్తే జరిమానా విధిస్తామని ఇటీవల కలెక్టర్ హెచ్చరికలు జారీ చేయగా.. చంద్రగిరి నియోజకవర్గంలో ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే పులివర్తి నానీ కూడా అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. జాతీయ రహదారిపై కూడా పలుచోట్ల చెత్త డంపింగ్ ఇప్పటికీ దర్శనమిస్తోంది. కాగా ఆంధ్రజ్యోతి పరిశీలనలో పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ తీరు మచ్చుకు కొన్ని ఇలా..! పుదిపట్ల పంచాయతీల్లో గాంధీపురం ఎదురుగా రోడ్డు పక్కనే ఉన్న మురుగుకాలువ చెత్త, వ్యర్థాలతో నిండిపోయి కంపుకొడుతోంది. దీనికి ఎదురుగా రోడ్డుపై వర్షపునీరు చేరి నీటి గుంతగా తయారైంది. పెరుమాళ్లపల్లెకి సమీపంలో రోడ్డుపక్కనే చెత్త, చెదారాలతోపాటు భవన నిర్మాణ వ్యర్థాలు కుప్పలు, కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. పద్మావతి వర్సిటీ వెనుకవైపు నుంచి తుమ్మలగుంటకు వెళ్లే దారిలో వరరూప అపార్ట్‌మెంట్ ముందు, తెలుగుతల్లి విగ్రహానికి సమీపంలో రోడుపక్కనే పడేసిన చెత్త కుప్పలపై దోమలు, ఈగలు చేరి దుర్వాసన వస్తోంది. కేవీఎస్ క్రీడాప్రాంగణం ఆర్చ్ సమీపంలో జాతీయరహదారి పక్కన ఎప్పటినుంచో పడేసిన చెత్తడంప్‌ను అలాగే వదిలేశారు. ఉప్పరపల్లెకి వెళ్లే మార్గంలో మురుగు కాలువలో చెత్తచేరి నీరు నిలచిపోయింది. అవిలాలలో పంచాయతీ కార్యాలయం వెనుకవైపు సుబ్బయ్య కాలనీలో ఇళ్లముందు మురుగు కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. వర్షాకాలం ప్రారంభమైనందున ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వీటిపై దృష్టిసారించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

మదనపల్లెలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

● సత్సంగ్ ఆశ్రమంలో బాబాజీ ఆలయం ప్రారంభం



అవతార్‌బాబా విగ్రహావిష్కరణలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

మదనపల్లె, జూలై 17: కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు విచ్చేశారు. పట్టణ శివారులోని సత్సంగ్ ఫౌండేషన్ అధినేత ఎస్.ముంతాజ్‌అలీ (శ్రీఎం)తో కలసి ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన ఆదినాథ్ శ్రీగురు మహావతార్ బాబాజీ ఆలయాన్ని ప్రారంభించారు. అలాగే ఆలయంలో ప్రతిష్ఠించిన బాబాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి కేంద్ర మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణ, కేరళవాయిద్యాల నడుమ కార్యాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కేంద్రమంత్రి గడ్కరి హెలికాప్టర్‌లో తిరుపతి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2:40 గంటలకు మదనపల్లెకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆశ్రమానికి చేరుకున్న గడ్కరీ ఆశ్రమంలో గంటన్నరకు పైగా విశ్రాంతి తీసుకుని, తర్వాత కార్యక్రమం నిర్వహిస్తున్న ఆలయం వద్దకు చేరుకున్నారు.అనంతరం సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని, ఆలయంలోని బాబాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ప్రముఖులు, అధికారులు, శ్రీఎం శిష్యులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణాశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, టీడీపీ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరామ్‌చినబాబు, బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి తదితరులు చిప్పిలి సమీపంలోని మైదానంలోని హెలిప్యాడ్‌కు చేరుకుని కేంద్ర మంత్రికి స్వాగతం పలికారు. అలాగే అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు పుష్పగుచ్ఛంతో కేంద్రమంత్రికి స్వాగతం పలికారు. 5:30 గంటలకు హెలికాప్టర్‌లో తిరుపతికి బయలుదేరి వెళ్లారు.



తిరుపతి తాజ్ హోటల్‌లో జరిగిన డీలర్స్ సమావేశంలో ఏషియన్ టైల్స్ డైరెక్టర్ భవిష్ పటేల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఓం శ్రీ ఎంటర్ ప్రైజెస్ అధినేత బిరుదాల హనుమంత రెడ్డి

భక్తుల తలపై పగిలిన టెంకాయలు



తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం బైరెడ్డిపల్లె మండలం పాతూరునత్తం గ్రామంలోని రేవణసిద్ధేశ్వర స్వామి ఆలయంలో బుధవారం తొలిఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఉత్సవం నిర్వహించారు. మొదట స్వామి మూలవిరాట్‌కు పూజలు నిర్వహించిన పూజారి.. తర్వాత దేవరెద్దుకు పూజలు చేశారు. కురబ కులస్థుల సంప్రదాయం ప్రకారం ఉపవాసదీక్షలోని భక్తుల తలలపై పూజారి టెంకాయలు పగలగొట్టారు. శివనామ స్మరణల మధ్య వివిధప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఈ కార్యక్రమాన్ని భక్తిపారవశ్యంతో తిలకించారు.

- బైరెడ్డిపల్లె

గవర్నర్ ఆదేశించినా..!

● చదువుల తల్లికి అందని ఎన్ఎస్‌పీ స్కాలర్‌షిప్

● ఉన్నత విద్యను ప్రోత్సహించని ఎస్వీయూ అధికారులు

● న్యాయం చేయాలంటూ రాష్ట్రపతికి పుంగనూరు విద్యార్థిని ఫిర్యాదు



ఉష

పుంగనూరు, జూలై 17: ఉన్నత విద్యకు ప్రోత్సాహకంగా ఎన్ఎస్‌పీ స్కాలర్‌షిప్ ఇవ్వాలని రాష్ట్ర గవర్నర్ ఆదేశించినా తిరుపతి ఎస్వీయూ అధికారులు పట్టించుకోలేదని పేద విద్యార్థిని ఉష పేర్కొన్నారు. దీనిపై బుధవారం ఆమె మాట్లాడారు. బాధితురాలు తెలిపిన ప్రకారం.. పుంగనూరు కోనేటిపాళ్యంకు చెందిన క్షురక వృత్తి చేసుకునే ఎం.ఉమాశంకర్ కష్టపడి కుమార్తె ఎం.ఉషను బీఎస్సీ, కుమారుడు జితేంద్రను బీటెక్ చదివించారు. ఉష డిగ్రీలో 90శాతం మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఇన్‌స్ట్రుమెంటేషన్ కోర్సులో 2021లో చేరారు. మొదటి సంవత్సరంలోనే ఎన్ఎస్‌పీ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసినా విద్యాదీవెన వస్తుండటం వల్ల ఇవ్వడం కుదరదని నిరాకరించారు. 2021 నవంబరు 5న అప్పటి గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కు ఫిర్యాదు చేయగా ఆయన అదే ఏడాది డిసెంబరు 29వ తేది ఎస్వీయూ వీసీకి లేఖపంపుతూ పేదవిద్యార్థిని చదువుకు స్కాలర్‌షిప్ ఇప్పించాలని ఆదేశించారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. ఈ సమస్యను అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆమె వాపోయారు. 80 శాతం మార్కులతో ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైనా (యూజీసీ నిబంధన ప్రకారం 60 శాతం ఉన్నా) గోల్డ్‌మెడల్ ఇవ్వలేదన్నారు. పీహెచ్‌డీ చేయాలని ఏపీఆర్‌సెట్ రాసినా అర్హత సాధించలేదన్నారు. గత ప్రభుత్వంలో అనేక పర్యాయాలు ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేసినా తనకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కొత్త ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందనే ఆశతో గత నెల 26వ తేది రాష్ట్రపతి ద్రౌపతిముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంశాఖమంత్రి అమిత్‌షా, యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్, గవర్నర్ నజీర్‌అహ్మద్, సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, జిల్లా కలెక్టర్‌లకు లేఖలు పంపానని తెలిపారు. ఉన్నత చదువుపై ఆసక్తితో ఉన్న తనను ప్రభుత్వం ప్రోత్సహించేలా ఎన్ఎస్‌పీ స్కాలర్‌షిప్‌తో బాటు అర్హతను బట్టి ఎస్వీయూ గోల్డ్‌మెడల్, పీహెచ్‌డీకి అవకాశం ఇవ్వాలని ఉష కోరారు.

మద్యం మత్తులో దూడను చంపేశాడు

గుడుపల్లె, జూన్ 17: మద్యం మత్తులో ఓ వ్యక్తి లేగ దూడను గాయపరచి చంపిన ఘటన గుడుపల్లె మండలంలో చోటుచేసుకొంది. స్థానికుల కథనం మేరకు...అత్తినత్తం గ్రామానికి చెందిన వేణుగోపాల్ బిసానత్తం సమీపంలో వ్యవసాయ భూమిని కర్ణాటక రాష్ట్రం టేకల్‌కు చెందిన మునిస్వామికి కౌలుకు ఇచ్చాడు. మునిస్వామి ఈ భూమిలో వ్యవసాయం చేసుకొని పాడి ఆవులను పెంచుకొంటున్నాడు.బుధవారం ఒంటిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం(44) కాడేపల్లెకు చెందిన తన స్నేహితుడు వెంకటేశుతో కలిసి బిసానత్తం సమీపంలో మద్యం సేవించారు. కొంత సమయం తరువాత వెంకటేశు తన గ్రామానికి వెళ్లిపోయాడు. సుబ్రహ్మణ్యం అక్కడే ఉండి మళ్ళీ మద్యం సేవించి కాలినడకన తన గ్రామానికి బయలుదేరాడు.దారిలో రోడ్డు పక్కన మునిస్వామి తన పాడి ఆవులు, దూడను చెట్టు కింద కట్టేసి ఉంచాడు. లేగ దూడ అరవడం గమనించిన సుబ్రహ్మణ్యం మద్యం మత్తులో ఆ దూడ పైకి దూకి గాయపరిచి చంపేశాడు.వేణుగోపాల్ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని సుబ్రహ్మణ్యంను ప్రశ్నించగా వారిపై దాడి చేశాడు. దీంతో వేణుగోపాల్ కుటుంబ సభ్యులు సుబ్రహ్మణ్యంను బంధించి పోలీసులకు అప్పగించారు.

సెలవు రోజుల్లోనూ వినియోగదారులకు సేవలు


బిల్లులు పరిశీలిస్తున్న జయరామ్

తిరుపతి(ఆటోనగర్),జూలై17: వినియోగదారులకు సెలవు రోజుల్లో సేవలందించడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని విద్యుత్ శాఖ తిరుపతి రెవెన్యూ డివిజన్-2 ఏఏఓ టి.జయరామ్ తెలిపారు. బుధవారం ఆయన పాత తిరుచానూరు రోడ్డులోని ఈఆర్‌వో కార్యలయం కౌంటర్‌లో బిల్లుల వసూలు తీరును పరిశీలించారు. బిల్లుల చెల్లింపు యాప్‌ల మార్పుతో ఇబ్బందులు పడకుండా కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. తమ డివిజన్ పరిధిలో ఒక్క రోజులోనే రూ.4లక్షలకు రెవెన్యూ పైగా వసూలు చేశామని వివరించారు.

పల్లెవెలుగు బస్టాండులో మెరుగైన సూచికలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తిరుపతి (ఆర్టీసీ), జూలై 17: సెంట్రల్ బస్ స్టేషన్‌లోని పల్లెవెలుగు బస్టాండులో బుధవారం చక్కటి బోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'సూచికలిలా ఉంటే ఎలా' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఏళ్ల నాటి పాతబోర్డులు తొలగించారు. వాటి స్థానంలో కొత్తవి సిద్ధం చేశారు. బోర్డులను ఆకర్షణీయంగా రంగులతో అర్థమయ్యేలా తీర్చిదిద్దారు. ప్రయాణికులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించండి


మాట్లాడుతున్న డీఎస్పీ రవిమనోహరాచారి

తిరుపతి(ఆర్టీసీ), జూలై 17: సెంట్రల్ బస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దుకాణ యజమానులు సహకరించాలని ఈస్ట్ డీఎస్పీ రవిమనోహరాచారి కోరారు. బుధవారం ప్రజారవాణాధికారి కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఆయన దుకాణ యజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాల సముదాయ యజమానే ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. వీటివల్ల ప్రయాణికులకు భద్రత, రక్షణ ఉంటుందన్నారు. లేకుంటే చోరీలు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను గుర్తించలేకపోతున్నామన్నారు. ప్రతి దుకాణ యజమాని వీటి ఏర్పాటుకు ఆర్థికంగా తోడ్పాటునందించాలన్నారు. సమావేశంలో ఆర్టీసీ డిప్యూటీసీటీఎం భాస్కర్‌రెడ్డి, ఏటీఎం డి.రామచంద్రనాయుడు, పోలీసు అధికారులు, దుకాణ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులతో నాగరాజనాయుడు

తిరుపతి(క్రీడలు), జూలై 17: తైక్వాండో జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన టీటీడీ విద్యా సంస్థల క్రీడాకారులను బుధవారం టీటీడీ విద్యాశాఖాధికారి వై.నాగరాజనాయుడు అభినందించారు. సత్తా చాటిన కోదండరామ, గోవిందరాజస్వామి, వేంకటేశ్వరస్వామి ఉన్నత పాఠశాలల క్రీడాకారులకు స్వర్ణం, రజిత, కాంస్యం పతకాలు, ప్రశంసాపత్రాలను డీఈవో అందజేశారు. తొలిస్థానం కైవసం చేసుకున్న రమ్యశ్రీ వచ్చేనెల 3, 4తేదీల్లో తాడిపత్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. తైక్వాండో శిక్షకుడు గోపీనాయుడు, క్రీడాకారులను అభినందించారు.

మంచినీళ్ల గుంట ప్రక్షాళనకు ఆరణి హామీ


ఎమ్మెల్యేకు వినతి అందజేస్తున్న కార్పొరేటర్లు

తిరుపతి అర్బన్, జూలై 17: స్థానిక మంచినీళ్ల గుంటను ప్రక్షాళన చేయించాలని ఆ ప్రాంత కార్పొరేటర్లు బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వెటర్నటీ ఆస్పత్రి వ్యర్థాలతో గుంటలోని నీరు కలుషితమవుతోందని వారు పేర్కొన్నారు. ఆ వ్యర్థాలు రాకుండా అరికట్టాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ మంచినీళ్ల గుంటను సందర్శించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆరణిని కలిసిక వారతలో నరసింహాచారి, పొన్నాల చంద్ర, కల్పన, వరికుంట నారాయణ, సి.కె. రవి, బాలసుబ్రహ్మణ్యం, దూది శివ, తిరుత్తణి వేణుగోపాల్, యాదవ్‌కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకులు వరప్రసాద్, రఫీ, ఆముదాల తులసి, అనంత సత్యనారాయణ, అశోక్, బాలమురళీకృష్ణ ఉన్నారు.

నగరం కథలు పుస్తకావిష్కరణ



తిరుపతి (కల్చరల్), జూలై 17: చిత్తూరు జిల్లా మాండలికంలో బాల్య విశేషాలను రచయిత చక్కగా కథల రూపంలో వెలువరించారని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తిరుపతికి చెందిన పశువైద్య కళాశాల ఆచార్యులు డాక్టర్ నగరం వినోద్ కుమార్ రచించిన నగరం కథలు పుస్తకం ఆవిష్కరణ సభ బుధవారం స్థానిక యూత్ హాస్టల్లో జరిగింది. ఈ తరం కవితా వేదిక నిర్వహించిన ఈ సభకు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. భారతీయ విద్యాభవన్ సంచాలకులు డాక్టర్ ఎస్. సత్యనారాయణరాజు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ద్రవిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, కుప్పం రెడ్డెమ్మ సాహితీ సంస్థ అధ్యక్షులు డాక్టర్ కె. రామలక్ష్మీ, చిత్తూరుకు చెందిన రచయిత్రి ఎంఆర్ అరుణకుమారి, ఎస్వీయూ తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి, విశ్రాంత గణితాచార్యులు డాక్టర్ భాస్కర్ రెడ్డ, ఆకాశవాణి పూర్వ అధికారి మల్లేశ్వరరావు, కథా రచయిత ఆర్‌సీ కృష్ణస్వామిరాజు పాల్గొనారు.

చెన్నై-తిరుపతి రహదారి పనులను పూర్తి చేయించండి


గడ్కరీతో భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 17: తిరుపతి-చెన్నై రహదారి విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి కోరారు. బుధవారం తిరుపతి విమానాశ్రయంలో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ... తిరుపతి-చెన్నై రహదారి విస్తరణ పనులు చాలా కాలంగా నిలిచిపోయాయన్నారు. భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ఆరు లైన్లుగా పనులను పునఃప్రారంభించి త్వరితగతిన పూర్తిచేయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

కేంద్రమంత్రి బఘేల్‌కు స్వాగతం



తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 17: కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్‌కు బీజేపీ నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనార్థం తిరుపతి వచ్చిన ఆయనను స్థానిక బీజేపీ నాయకులు జల్లి మధుసూదన్, గుండాల గోపీనాథ్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు చంద్రారెడ్డి తదితరులు కలిసి సన్మానించారు.

మధ్యప్రదేశ్ ఎంపీకి సన్మానం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 17: మధ్యప్రదేశ్ ఎంపీ ఫగ్గన్‌సింగ్ కులస్తేను స్థానిక జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులతో ఎంపీ మాట్లాడుతూ... క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుబాల చంద్రశేఖర్, జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఇతర నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, మల్లారపు రవిప్రసాద్, కవిత, గూండాల్ నాయక్, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అవధాన సంగమ సదస్సు

తిరుపతిరూరల్,జూలై17: జాతీయ సంస్కృత వర్సిటీలో రిషిహుడ్ వర్సిటీ ఆధ్వర్యంలో మూడ్రోజులపాటు నిర్వహించిన అవధాన సంగమ సదస్సు బుధవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన స్విమ్స్ మెడిసిన్ విభాగ హెడ్ ప్రొఫెసర్ అల్లాడి మోహన్ మాట్లాడుతూ అవధాన ప్రక్రియల ద్వారా విద్యార్థుల మేధోసంపత్తి వృద్ధి చెందుతుందన్నారు. షిహుడ్ వర్సిటీ మానవ విజ్ఞానకేంద్ర డైరెక్టర్ ప్రొఫెసర్ సంపదానంద మిశ్రా మాట్లాడుతూ అవధానాన్ని సరళంగా తెలియజేసేందుకు ఒక గ్రంథం అందుబాటులోకి వచ్చిందన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ అవధాన ప్రక్రియపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. అకడమిక్ డీన్ రజనీకాంత శుక్లా, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి, డాక్టర్ నీలాబ్‌శర్మ, డాక్టర్ వైష్ణవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోవిందధామం కార్యవర్గ ఎన్నిక




తిరుపతి (జీవకోన), జూలై 17: గోవిందధామం (మహాప్రస్థాన సేవా సమితి) నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. కార్యవర్గ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా జి.నాగరాజు, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, కార్యదర్శిగా పురుషోత్తం, ఎన్ పటేల్, కోశాధికారిగా బి.గోపీనాథ్‌రెడ్డి, సహకార్యదర్శిగా రామశేఖర్, సహకోశాధికారిగా రామమోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టెంకాయల దామోదరం, ఆదం సుధాకర్‌రెడ్డి, మాగం హేమచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈసారైనా ఆదాయం పెరిగేనా?

శెట్టిపల్లి చెరువును నాలుగేళ్లుగా తక్కువధరకే సొంతం చేసుకున్న కాంట్రాక్టర్

బహిరంగవేలమైతే ఆదాయం బాగా పెరిగే అవకాశం




శెట్టిపల్లి చెరువు

వ. సంఖ్య	హెచ్చుపాట దారుడు	సంవత్సరం	ఫసలీ సాలు	వేలము మొత్తము	చెల్లించిన మొత్తము	చెల్లించవలసిన మొత్తము	
01	పి. ముని చెంగయ్య	2019	1429	3703000	260000	1103000	
02	టి. రమేష్	2020	1430	930750	930750	0	
03	టి. రమేష్	2021	1431	1209000	1209000	0	
04	టి. రమేష్	2022	1432	1329900	1229900	100000	
05		1433 [illegible]					

శెట్టిపల్లి చెరువు వేలంపాటలో వచ్చిన ఆదాయం

మంగళం, జూలై 17: శెట్టిపల్లి చెరువుకు నాలుగేళ్లుగా వేలంపాటల్లో ఒక్కరే రంగంలో నిలుస్తున్నారు.ఎప్పుడు వేలం పాట జరిగినా వైసీపీ అండదండలున్న టి.రమేష్‌దే ఆధిపత్యం. 2019లో వేలం జరిగితే పి.మునివెంగయ్య రూ.37.03 లక్షలకు చెరువును దక్కించుకున్నాడు.ఆ తర్వాత 2020లో టి.రమేష్ రంగప్రవేశం చేసి కేవలం రూ.9,30,750కే చెరువును దక్కించుకున్నాడు. అంటే అంతకుముందు ఏడాదితో పోలిస్తే దాదాపు రూ.28లక్షలు శెట్టిపల్లి పంచాయతీ ఖజానాకు గండి పడింది. 2021లో మరీ తక్కువగా హస్తగతం చేసుకుంటే ఎవరికైనా అనుమానం వస్తుందేమోనని రూ.12.09 లక్షలకు, 2022లో రూ.13,29,900లకు శెట్టిపల్లి చెరువును సొంతం చేసుకున్నాడు.మూడేళ్లుగా శెట్టిపల్లి చెరువు ద్వారా లక్షల్లో పంచాయతీకి నష్టం వస్తూనే ఉంది. 2022 తరువాత శెట్టిపల్లి పంచాయతీ తిరుపతి నగరపాలక సంస్థలో విలీనమైంది. అయితే నగరపాలక సంస్థ నిర్వహించే వేలంలో శెట్టిపల్లి చెరువును ఎక్కువ ధరకు ఎవరు పాడతారో వారికే కేటాయించాలి. కానీ ఈ సంవత్సరం కూడా రమేష్ అధికారులను మేనేజ్ చేసుకుని తిరిగి చెరువును హస్తగతం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.వైసీపీ పెద్దలే రమేష్‌ను బినామీగా రంగంలోకి దించినట్లు చెబుతున్నారు. అతడి ద్వారా 2020 నుంచి ఇప్పటివరకు వీరు చెరువును హస్తగతం చేసుకుని ఏటా రూ.40లక్షలకు పైగా ఆదాయం పొందుతున్నట్లు తెలుస్తోంది. శెట్టిపల్లి చెరువులో ప్రధానంగా గెండ్లు, బొచ్చలు, బంగారు తీగలు, కొరమేను చేపలు ఎక్కువగా లభిస్తున్నాయి. వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. 2019లో పి.మునిచెంగయ్య ఏడాదికి రూ.37లక్షలు చెల్లిస్తే, రమేష్ మాత్రం 2020 నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.34లక్షలు మాత్రమే చెల్లించాడు. దీని ప్రకారం పంచాయతీకి లక్షల్లో నష్టం వాటిల్లిందనేది సుస్పష్టం. గత నాలుగేళ్లుగా తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని చెరువులోని చేపలను అమ్ముకోవడం ద్వారా వైసీపీ పెద్దలు కోట్లలో లబ్ధి పొందారు.

ఎమ్మెల్యే ఆరణి స్పందించాలి

శెట్టిపల్లి చెరువును తమ హస్తగతం చేసుకుని పంచాయతీ ఖజానాకు గండి కొట్టి ఇపుడు అదే తరహాలో నగరపాలక సంస్థ ఖజానాకు సైతం వలేయాలని చూస్తున్న వైసీపీ నేతల అక్రమాలకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గతంలో స్థానికులు చెరువుకు బహిరంగ వేలం వేయాలంటూ కలెక్టర్లకు అర్జీలు పెట్టుకున్నారు. చెరువులో నాలుగు సంవత్సరాలుగా నీరు పుష్కలంగా ఉండి చేపల ఆదాయం కూడా పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. చెరువు బహిరంగ వేలం ద్వారా లక్షల్లో నగరపాలక సంస్థకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి, నగరపాలక అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ దోపిడీ నిధుల రికవరీ ఖాయం

- మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి(ఆటోనగర్), జూలై17: ఐదేళ్లలో గత వైసీపీ ప్రభుత్వం దోచుకున్న కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కూటమి ప్రభుత్వం రికవరీ చేయడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆమె మాట్లాడుతూ పథకాల పేరిట వైసీపీ నాయకులు ఊదరగొడుతూ 90శాతం నిధులు దోచుకున్నట్లు ఆధారాలతో బహిర్గతం చేయడానికి ప్రయత్నం జరుగుతోందన్నారు. సహజ వనరుల దోపిడీ, భూ దందాలు, అక్రమాలపై ప్రభుత్వం ఒక్కొక్కటిగా శ్వేతపత్రాలను విడుదల చేస్తుందన్నారు.వైసీపీ పాలనలో 1.75 లక్షల ఎకరాలు కబ్జా చేశారని ఆరోపించారు. ఇంటి పట్టాల పేరుతో పది వేల ఎకరాలు, ఇసుక దందాలతో రూ.9,750 కోట్లు కాజేశారన్నారు. తిరుపతి,రేణిగుంట మండలాల్లో 982 ఎకరాల ప్రభుత్వమఠం భూములను వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని సుగుణమ్మ ఆరోపించారు. చిత్తూరులో 782 ఎకరాలు, ఒంగోలులో నకిలీ పత్రాలు చూపి రూ.101 కోట్లు కాజేశారన్నారు. వీటిపై విచారణ జరుపుతారన్నారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటుందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు చినబాబు, సూరా సుధాకర్‌రెడ్డి,బుల్లెట్ రమణ,మన్నం శ్రీనివాసులు, ఊట్ల సు రేంద్రనాయుడు,రజినీకాంత్‌నాయుడు,హేమంత్‌రాయల్,ఎ.తులసీ సుబ్బారావులు పాల్గొన్నారు.

నైపుణ్య విద్య అవసరం


సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 17: ఈ తరానికి నైపుణ్య విద్య అవసరమని పలువురు ప్రతినిధులు పేర్కొన్నారు. కొత్త జాతీయ విద్యా విధానంపై పద్మావతి యూనివర్సిటీ సెమినార్ హాల్లో బుధవారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఉమెన్ స్టడీస్ - అడల్ట్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సంయుక్తంగా దీనిని నిర్వహించాయి. ఇందులో అడల్ట్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ అధ్యక్షులు రాజా, సలహాదారు భారతిదాసన్, యూనివర్సిటీ ప్రతినిధి పార్థసారధి తదితరులు మాట్లాడారు. విద్యా రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలని వారు కోరారు.

ఆగస్టు 6, 7 తేదీల్లో చలో ఢిల్లీ : ఆర్.కృష్ణయ్య

తిరుపతి అర్బన్, జూలై 17: వచ్చేనెల 6, 7తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వాంతంత్ర్యం వచ్చాక చట్టసభల్లో బీసీలకు న్యాయం జరగలేదన్నారు. రాజ్యాంగాన్ని సవరించి అసెంబ్లీ, పార్లమెంట్లలో 50శాతం సీట్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 50శాతానికి, గృహకల్పనలో 56శాతానికి రిజర్వేషన్ పెంచాలన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై ఈ పార్లమెంటు సమావేశంలో కేంద్రాన్ని నిలదీస్తానన్నారు. అన్ని రాష్ట్రాల్లో ప్రతి బీసీ కుటుంబానికి రూ.20లక్షలు ఉపాధి పథకం కింద మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో కనకదాసు విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు.

కురుబ సామాజిక వర్గానికి ప్రాధాన్యం

- సీఎంకు కేంద్ర మంత్రి బఘేల్ కృతజ్ఞతలు


కేంద్రమంత్రి బఘేల్‌ను సన్మానిస్తున్న కురుబ, కురమ, కురవ సామాజిక వర్గ నేతలు

తిరుపతి అర్బన్, జూలై 17: కురుబ, కురుమ, కురవ సామాజిక వర్గ ప్రజాప్రతినిధులను బుధవారం తిరుపతిలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ఏపీ కురుబ, కురుమ, కురువ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాసుల ఆధ్వర్యం వహించారు. కేంద్ర సహాయమంత్రి ఎస్పీ సింగ్ బఘేల్, కర్ణాటక మాజీ మంత్రి రేవన్న, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఎంపీలు బసవరాజ్(కర్ణాటక), బాయ్‌బాబుదేశాయ్(గుజరాత్) వంటి ముఖ్య నేతలు హజరయ్యారు. వీరికి శాలువా కప్పి, జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ సామాజిక వర్గాలకు రాష్ట్రప్రభుత్వాలు అన్నింటా రిజర్వేషన్ కల్పించాలని కోరారు. తమకు ప్రాధాన్యతనిచ్చినఏపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఇతరులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రెడ్డికుమార్, మంగిరెడ్డెప్ప, గుండ్లూరు శ్రీనివాసులు, మళ్లీ, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌గా అవతరణ

2047కల్లా దేశం వికసిత్ భారత్‌గా అవతరించనుందని కేంద్ర మంత్రి బఘేల్ చెప్పారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ మోదీ అద్భుతమైన సుపరిపాలన అందిస్తున్నారని ప్రజలు ప్రశంసిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కురుబ, కురుమ, కురువ కులస్థులలో ఇద్దరికి ఎంపీలుగా,ఒక మహిళను మంత్రిని చేశారని సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోండి

ఎస్పీకి జర్నలిస్టుల విజ్ఞప్తి



తిరుపతి(నేరవిభాగం), జూలై 17 : జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసి తీవ్రంగా దుర్భాషలాడిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని బుధవారం జర్నలిస్టులు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడును కలిసి ఫిర్యాదు చేశారు. అక్రమ సంబంధం అవినీతి, తదితర ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయసాయి తన స్థాయి మరచి జర్నలిస్టులపై అమర్యాదగా, అసభ్యకరంగా మాట్లాడిన తీరుపై కేసు నమోదు చేసి బెయిల్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, ప్రకాష్ నాయుడు, దినేష్‌కుమార్, మోహన్‌కృష్ణ, కోలా లక్ష్మీపతి, వెంకటరత్నం, ఉమాశంకర్, హరిబాబు, వట్టికుంట శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్ ఆస్పత్రిలో మెరుగైన సేవలందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

తిరుపతి అర్బన్, జూలై 17: స్విమ్స్‌లో రోగులకు మెరుగైన సేవ లందించాలని టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ కిరణ్ కోరారు. బుధవారం స్విమ్స్ డైరెక్టర్ ఆర్.వి.కుమార్, డాక్టర్స్ రామ్, వివేక్, ఎంఆర్డీ మురళీతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఇక్కడి చికిత్సపై టీటీడీ ఉద్యోగులకు భయాందోళన, అభద్రత భావం ఉందన్నారు. ఈ పద్ధతికి స్వస్తిపలకాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు, పెన్షనర్లకు సీనియర్ డాక్టర్ పర్యవేక్షణలో ప్రత్యేక ఓపీ విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఓపీ విభాగానికి మరమ్మతులు చేయించి ఏసీ అమర్చాలన్నారు. సమావేశంలో టీటీడీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆనందరాజు, డాక్టర్ నర్మద, హరితరెడ్డి, సునీల్ కుమార్‌యాదవ్, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

ఏజీఎల్ ఎక్స్‌క్లూజివ్ టైల్స్‌షోరూం ప్రారంభం



తిరుపతి అర్బన్, జూలై 17: స్థానిక ఆర్టీసీ రోడ్డులో మారుతీ ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటుచేసిన ఏజీఎల్ ఎక్స్‌క్లూజివ్ టైల్స్ షోరూం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏజీఎల్ ఎండీ భవిష్‌పటేల్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి సంబంధించిన అన్ని రకాల టైల్స్ మార్బల్స్, బాత్‌వేర్, క్వార్జ్ తమ షోరూంలో అందుబాటులో ఉన్నాయన్నారు. పట్టణ, శివారు గ్రామాల ప్రజలు షోరూంను సదర్శించాలని కోరారు. ప్రారంభ కార్యక్రమంలో సౌత్‌సేల్స్ హెడ్ బాలాజీశేషాద్రి, అధినేత రవీంద్రనాయుడు, మారుతీనాయుడు, దేవేంద్రనాయుడు, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మిట్టవీధిలో తాగునీటి సమస్యకు పరిష్కారం


బోరును ప్రారంభించిన నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), జూలై 17: మిట్టవీధిలో తాగునీటి సమస్య పరిష్కారమైనట్లు బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మూడు నెలలు కావస్తున్నా తాగునీటి బోరు మరమ్మతులను పట్టించుకోని వైనాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో కొత్త మోటారుతో పాటు పైపలను కూడా ఏర్పాటు చేశారన్నారు. బుధవారం నవీన్‌కాలనీలో పర్యటించి కొత్త బోరును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన వాటర్ వర్క్స్ ఇంజనీరింగ్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా ఫాగింగ్ బ్లీచింగ్‌లతో పాటు కాలువల్లో చెత్త తొలగించడం నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని కోరారు.

అనుప్పల్లి రోడ్డులో ప్రయాణం ప్రమాదకరం



వేణుగోపాలపురం వద్ద ప్రమాదకర మలుపు - తిమ్మరాజుపల్లి వద్ద ఏర్పడ్డ నీటి గుంతలు

రామచంద్రాపురం, జూలై 17: రాయలచెరువు నుంచి అనుప్పల్లి వెళ్లే రోడ్డులో గుంతలు, మలుపులతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రాయలచెరువుకట్ట నుంచి అనుప్పల్లి వరకు 15కిలోమీటర్ల దూరం ఉంది. కట్ట నుంచి సూరావారిపల్లె వరకు అవతలి వైపు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియని ప్రమాదకర మలుపులు మూడు ఉన్నాయి. తిమ్మరాజుపల్లి దాటిన తరువాత వేణుగోపాలపురం మలుపు వద్ద ఏడాదిలో ప్రమాదాల బారిన పడి ఐదుగురు మృతి చెందారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్ల పాటు రోడ్ల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు దారి పొడవునా పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ఎక్కడ ఎంత లోతు ఉందో తెలియక వాహనచోదకులు అదుపు తప్పి బోల్తా పడుతున్నారు. గత యేడాది అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి ఎన్నికల హడావుడిలో తూతూమంత్రంగా గుంతలు పూడ్చించారు. కొద్దిరోజులకే యథాస్థితికి చేరుకున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి వాహనచోదకుల ఇబ్బందులను తొలగించాల్సి ఉంది.

కదలకుండానే కాసులు... మూలనపడ్డ క్లాప్ ఆటోలు

సూళ్లూరుపేట, జూలై 17: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటింటా చెత్త సేకరణ పేరుతో రాష్ట్ర స్థాయిలో ఓ సంస్థకు కాంట్రాక్టు అప్పగించింది. ఇందులో భగంగా సూళ్లూరుపేట మున్సిపాలిటీకి ఏడాది ముందు 8 బ్యాటరీ ఆటోలను అందజేశారు. మొత్తం 25 వార్డులకు గాను ఒక ఆటో 3 వార్డులకు చొప్పున 8 ఆటోలను అంద జేసి ఆయా వార్డుల్లో సందుసందుకెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి ఆటోల ద్వారా తరలించారు. వీటి నిర్వహణకు సదరు ఏజెన్సీకి నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు మున్సిపాలిటీ చెల్లిస్తోంది. ఇంత చెల్లిస్తున్నా వాటి నిర్వహణ తీరు చాలా ఘోరంగానే ఉంది. ఓ నాలుగు రోజులు ఆటోల్లో చెత్త సేకరించారు. ప్రస్తుతం ఆ ఏజెన్సీకి చెందిన ఒక ఆటో కూడా చెత్త సేకరణకు తిరగడం లేదు. ఏడాదిగా ఆఆటోలు మున్సిపల్ కార్యాలయ షెడ్‌లో మూలన చేరాయి. బ్యాటరీలు పనిచేయడం లేదని పలుసార్లు సదరు ఏజెన్సీకి అధికారులు సమాచారం ఇచ్చినా నేటికి వాటి బాగోగులు చూడలేదు. క్లాప్ ఆటోలు మూలనపడడంతో మున్సిపాలిటీలో ట్రాక్టర్ల ద్వారానే చెత్తను సేకరించి తరలిస్తున్నారు. అప్పటి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఆటోల కొనుగోలు పేరుతో సదరు ఏజెన్సీకి చెల్లించినా ఆ వాహనాలు ఎందుకూ పనికిరాకుండా దర్శనమిస్తున్నాయి.


మున్సిపాలిటీ షెడ్‌లో ఉన్న క్లాప్ ఆటోలు


ట్రాక్టర్ల ద్వారానే చెత్తను సేకరిస్తున్న కార్మికులు

శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి ద్వార బంధనాలు



కోట, జూలై 17: మండల పరిధిలోని తిమ్మానాయుడు పాళెంలో జ్ఞానప్రసూ నాంబ సమేత సంత కాళహస్తీశ్వర స్వామి ఆలయానికి బుధవారం ద్వార బంధనాలను ఏర్పాటు చేశారు. ఆలయ పునఃనిర్మాణ పనుల్లో భాగంగా వేదపండితుల మంత్రో చ్చరణల నడుమ చెన్నైకు చెందిన భక్తుల పర్యవేక్షణలో ద్వార బంధ నాలను ఏర్పాటు చేశారు. వందలాది మంది ముత్తైదువులు ఈ క్రతువులో పాల్గొన్నారు.

నేడు చిట్టమూరులో ఎమ్మెల్యే పర్యటన

చిట్టమూరు, జులై 17 : గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ గురువారం చిట్టమూరు మండలంలో పర్యటిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ జి.కిషోర్‌నాయుడు తెలిపారు. ఉదయం ఈశ్వరవాక, అరవపాళెం, బయ్యవారికండ్రిగ, ఆలేటిపాడుల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నటు ఆయన తెలిపారు. మండలంలోని టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీపై అవగాహన



చిల్లకూరు, జూలై 17: మండలంలోని బల్లవోలులో వ్యవసాయశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులకు డ్రోన్ సాయంతో పంటకు పురుగు మందుల పిచికారీపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. సాంకే తిక పరికరాలతో సాగు చేయడం ద్వారా ఖర్చులు తగ్గడంతోపాటు సమయం కూడా ఆదా అవుతుందన్నారు. డ్రోన్ ద్వారా పురుగుమందులు పిచికారీతో కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. అలాగే మందలను కూడా ఎకరాకు 10 శాతం వరకు ఆదా చేయవచ్చన్నారు.

రోటరీ క్లబ్ కార్యవర్గం

గూడూరు అర్బన్, జూలై 17: స్థానిక రోటరీ భవన్‌లో బుధవారం రోటరీ క్లబ్ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శిగా గోపాల్‌నాయుడుని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ... రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. బి.సురేంద్రరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, మునిగిరీష్, సతీష్, వాసు, దశరథరామిరెడ్డి, మయూరి శ్యాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి


వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

గూడూరు అర్బన్, జూలై 17: ద్విచక్రవాహన దారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం పోటుపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హెల్మెట్‌ను ధరించి వాహనాలు నడిపితే ప్రమాదం జరిగితే ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చన్నారు.రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


బిర్యానీ పొట్లాల పంపిణీ



క్రాస్‌రోడ్డు సెంటరులో బిర్యానీ పొట్లాల పంపిణీలో టీడీపీ నాయకులు

వెంకటగిరి, జూలై 17: ఎమ్మెల్యే రామకృష్ణ పుట్టిన జన్మదిన వేడుకల్లో భాగంగా బుధవారం క్రాస్ రోడ్డు సెంటరులో ఆయన అభిమానులు, మిత్ర బృందం ఆధ్వర్యంలో బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను ఎమ్మెల్యే రామకృష్ణ కట్ చేసి పంచిపెట్టారు. తనను మూడో సారి ఎమ్మెల్యేగా గెలిపించిన వెంకటగిరి ప్రజలకు జీవితాం రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అనునిత్యం పాటుపడతానని చెప్పారు. అనంతరం కురుగొండ్ల అభిమానులు కాపా శ్రీనివాసులు నాయుడు, రంగినేని శాంతారావు, చిట్టేటి ఉయకుమార్, మాబూ, బాషా, మల్లారం బాబు తదితరులు సమకూర్చిన బిర్యానీ ప్యాకెట్లను పంచిపెట్టారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

డక్కిలి, జూలై 17: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కంథలవారిపల్లి ప్రాథమిక పాఠశాలోని విద్యార్థులకు ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. తన పుట్టిన రోజున బొకేలు, శాలువాలు తీసుకు రావద్దని ఎమ్మెల్యే కురుగొండ్ల చెప్పిన విషయం విదితమే. ఈక్రమంలో ఆయన పుట్టిన రోజున విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని అందించినట్టు నాయకులు చెప్పారు. ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ జి.మునెయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు మంగళంపురి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం


ఊరేగింపునకు సిద్ధంగా ఉన్నగుమటం

కోట/ ఓజిలి, జూలై 17: కోట మండల పరిధిలోని కేశవరంలో మూడు రోజులపాటు జరిగిన మొహ్రర్రం కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు పీర్లను గుమటంలో ఉంచి కేశవరంలో మేళతాళాల మధ్య ఊరేగించారు. పీర్లను ఎత్తుకునేందుకు గ్రామస్తులు పోటీపడ్డారు. గుమటం, పీర్లను తిరిగి చావడిలో చేర్చారు. ఓజిలి మండలంలో ముస్లింలు బుధవారం మొహర్రం (పీర్లపండుగ)ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్జిమేడు, అరిమేనిపాడు, రాచపాళెం, అత్తివరం, సగుటూరువడ్డిపాళెంలలో ముస్లిం మత పెద్దలు బోధనలు చేశారు.

తిరుమలలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరి

తిరుమల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి నితిన్ గడ్కరి శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమల వచ్చారు. వకుళామాత గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ఆయనకు టీటీడీ ఈవో శ్యామలరావు స్వాగతం పలికి బస ఏర్పాట్లు చేశారు. కాగా, కేంద్రమంత్రి నితిన్ గడ్కరి గురువారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు. తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి ఎస్పీ సింగ్ బఘేల్, బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, తెలంగాణ మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యే ఆదినారాయణ ఉన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు


సూళ్లూరుపేటలో స్వామివారి ఊరేగింపు - నాయుడుపేట పట్టణంలోని పాతబ్రాహ్మణవీధిలో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ - శ్రీలక్ష్మమ్మకాలనీలో ఉన్న వేంకటేశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ

గూడూరు అర్బన్/ చిల్లకూరు/ సూళ్లూరుపేట/ నాయుడుపేట/ కోట, జూలై 17: తొలి ఏకాదశి పండుగ సందర్భంగా బుధవారం గూడూరు పట్టణంలోని పలు వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు ప్రసన్న వేంకటేశ్వరస్వామి, బాలాజీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. చిల్లకూరు మండలంలోని కలవకొండలో లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేకపూజలు జరిగాయి. రాత్రికి స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. సూళ్లూరుపేట పట్టణంలోని మద్వేంకటరామమూర్తి స్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. షార్ బస్టాండు సమీపంలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, బాపూజీ వీధిలోని పాండురంగస్వామి ఆలయాల్లో స్వామివార్లను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పట్టణంలో ఊరేగిస్తూ భజనలు చేశారు. నాయుడుపేట పట్టణంలోని పాతబ్రాహ్మణవీధిలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, స్వర్ణముఖినది పరీవాహక ప్రాంతంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం, తుమ్మూరు కరిమాణిక్యస్వామి దేవస్థానాల్లో శ్రీవారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా పుష్పాలంకరణ గావించారు. విష్ణు సహస్రనామాలు, మూలమంత్రం, లక్ష తులసి పూజలు నిర్వహించారు. కోట మండలంలోని పలు వైష్ణవ ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. మహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లే ఘట్టాన్ని పురస్కరించుకొని పలు వేంకటేశ్వర ఆలయాలు ముస్తాబయ్యాయి. నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి, చిట్టేడు, లక్ష్మమ్మ కాలనీల్లో భక్తులు ఏకాదశి పూజలు నిర్వహించారు.

సర్వీస్ రోడ్లు మంజూరు చేయండి

● కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతి


గడ్కరీకి వినతిపత్రం అందిస్తున్న నరేంద్రరెడ్డి తదితరులు

పెళ్లకూరు, జూలై 17 : మండలంలోని చిల్లకూరు నుంచి దిగువ చావాలి వరకు ఉన్న అండర్ పాస్‌లను కలిపే విధంగా 71వ జాతీయ రహదారికి ఇరువైపులా రెండు లేన్ల సర్వీస్ రోడ్లు మంజూరు చేయాలని రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.నరేంద్రరెడ్డి వినతిపత్రం అందజేశారు. బుధవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎస్.మునిసుబ్రహ్మణ్యం, ఎస్.దయాకర్‌రెడ్డితో కలసి పాలచ్చూరుకు నరేంద్రరెడ్డి కలసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 71 జాతీయ రహదారికి ఇరువైపుల సర్వీస్ రోడ్లు లేకపోవడంతో పాలచ్చూరు, కప్పగుంటకండ్రిగ, దిరసనమాల, జంగాలపల్లి, పెరుమాళ్లపల్లి, అనకవోలు తదితర 10 గ్రామాలకు చెందిన 10వేల మందికి పైగా జనాభాతో పాటు మేనకూరు సెజ్‌లకు వెళ్లే వందలాది మంది కార్మికులు, రహదారికి ఇరువైపుల పంటలను సాగు చేస్తున్న రైతులు పడే అవస్థలను కేంద్రమంత్రి గడ్కరీకి విన్నవించారు. ముఖ్యంగా ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యానికి గురైతే కనీసం 108 వాహనం వచ్చే అవకాశం లేదన్నారు. దీంతో స్పందించిన కేంద్రమంత్రి నిధులు మంజూరుకు హామీ ఇచ్చినట్లు నరేంద్రరెడ్డి తెలిపారు.

వైభవంగా పాండురంగడి రథోత్సవం



గూడూరు, జూలై 17: స్థానిక గమళ్లపాళెంలోని పాండురంగస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి కావడంతో భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారిని రథంపై ఉంచి మంగళ వాయిద్యాలు, కోలాటాల నడుమ రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు.

ఆగస్టు 25 నుంచి టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు

గూడూరు, జూలై 17: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 25 నుంచి 28వ తేదీ వరకు ఏ.ఏ.రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలను నిర్వహించనున్నట్లు ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ చెప్పారు. నెల్లూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి 18 మండలాల జట్లు పోటీల్లో పాల్గొంటాయన్నారు.

ఆత్మగౌరవ పోరాటాలు చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కోట, జూలై 17: హక్కులకోసం బహుజనులు ఆత్మగౌరవ పోరాటాలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు, బహుజన ఐక్యవేదిక నాయకుడు బి.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కోట పట్టణంలోని షాదీమంజిల్‌లో బుధవారం బహుజనుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కారంచేడు స్ఫూర్తి సభ జరిగింది. ముందుగా బహుజన ఐక్యవేదిక నాయకులు అంబేడ్కర్, కాన్షీరాం, పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రాజ్యాధికారం కోసం అందరూ కలసికట్టుగా ముందుకు సాగాలన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయ సాధన కోసం 85 శాతం జనాభా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తమ ఆలోచనలకు పదును పెట్టాలన్నారు. కారంచేడు, చుండూరు ఘటనలపై అప్పట్లో ప్రచారం జరగలేదన్నారు. బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలన్నారు. దాసరి సుందరం, ఎం.మాధవ్, రంగనాథ్, అశోక్, యునైటెడ్ ఫోరం మహిళా అధ్యక్షురాలు డి.పద్మజ, వి.దినకర్ బాబు, రామకృష్ణ, ఎ.పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శూల గ్రామోత్సవం



నాయుడుపేట టౌన్, జూలై 17 : పట్టణంలోని లోతువానిగుంటలో కొలువై ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలో పొం గళ్ల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అమ్మవారికి అంబళ్లు పోశారు. రాత్రి మంగళవాయిద్యాల నడుమ శూల గ్రామోత్సవం నిర్వహించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.15 కోట్లు

తిరుమల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.15 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 71,409 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,128 మంది తలనీలాలు సమర్పించారు.

ఘనంగా కురుగొండ్ల పుట్టిన రోజు వేడుకలు



క్రాస్‌రోడ్డులో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ - కస్తూర్బా గాంధీ పాఠశాలలో మొక్క నాటుతున్న కురుగొండ్ల

వెంకటగిరి, జూలై 17: వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలు బుధవారం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే నేతలు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. ఇంటో పూజల అనంతరం నాయకలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పోలేరమ్మను దర్శించుకున్నారు. అక్కడి నుంచి పట్టణంలోని కస్తూర్బా విద్యాలయానికి చేరుకున్న రామకృష్ణ నేతలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్‌చేసి విద్యార్థుల మధ్య తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. అలాగే మొక్కను నాటారు. అనంతరం తన నివాసానికి చేరుకున్న ఆయన భైరవరం దాసరి బ్రదర్స్ ఏర్పాటు చేసిన 60 కిలోల కేక్‌ను కట్‌చేశారు. నాయకులు, అభిమానులు ఈ సందర్భంగా రామకృష్ణను గజమాలతో సత్కరించారు. ఈ సారి ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలకు హజరైన వారు విద్యాసామగ్రి తీసుకువచ్చారు. ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్య నాయకుల్లో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి బీద రవిచంద్ర, గంగోటి నాగేశ్వరరావు, హజరత్త నాయుడు, జె.రమణయ్య, వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, మల్లారం బాబు, జీకేపల్లి బాబు నాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యం, జానపాటి బాలకృష్ణ, రంగినేని రాజా, గడ్డం చంద్రశేఖరరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పోలంరెడ్డి వెంకటరెడ్డి, పులి జానార్దనరెడ్డి, మునికృష్ణయ్య, మాధవరెడ్డి, శ్రీరామదాస్ గంగాధర్, పునుగోటి విశ్వనాథనాయుడు, గొల్లగుంట మురళీకృష్ణ, సామల లక్ష్మీపతి, జానపాటి మురళి, డివిఆర్, పులికొల్లు శివకుమార్ నాయుడు, నాగరాజు, తాండవ చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

బాలాయపల్లి: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలను బాలాయపల్లి టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. గొట్టికాడులో ప్రతాప్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఎస్.భాస్కర్ రావు, కె.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలసిన పనబాక భూలక్ష్మి



నాయుడుపేట, జూలై 17: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను విజయవాడలో నాయుడుపేటకు చెందిన నెల్లూరు పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి బుధవారం మర్యాదపూర్వకంగా కలసినట్లు తెలిపారు. జిల్లాలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఆమె వెంట టీడీపీ నాయకులు గంగరాజు, గంగబాబు, గంగాధరయ్య, హరి ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



వాకాడు, జూలై 17: నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బాలిరెడ్డిపాళెం స్వర్ణముఖినదిలో సెబ్ సిబ్బంది బుధవారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ... చిట్టమూరు మండలం కొక్కుపాళెంకు చెందిన ఇయశ్వంత్, చిల్లకూరు మండలం చింతవరానికి చెందిన సూలయ్య బాలిరెడ్డిపాళెం స్వర్ణముఖి నదిలో మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ జయరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్



వాకాడు, జూలై 17: మండలంలోని దుగరాజపట్నంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్ చేయడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందజేశారు. కానిస్టేబుల్ సురేష్ సంఘటనా స్థలికి చేరుకుని చాకచక్యంగా మతిస్థిమితం లేని వ్యక్తిని కిందకు తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు.

యువతిపై లైంగిక దాడి

గూడూరు, జూలై 17: తనపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడినట్లు ఒక విద్యార్థిని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటర్మీడియట్ చదువుతున్న ఆ యువతి కళాశాలకు వెళ్లి వస్తుండగా అశోక్‌నగర్‌కు చెందిన వినయ్‌కుమార్ బలవంతంగా ఆటోలో ఎక్కించుకున్నాడు. గాంధీనగర్ ప్రాంతానికి తీసుకువెళ్లి ఓ ఇంట్లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆ యువతి బుధవారం ఇంట్లో ఫినాయిల్ తాగి అస్వస్థతకు లోనైంది. చికిత్సనిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా జరిగిన సంఘటన వెలుగులోకి వచ్చింది. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.

పట్టపగలే మన్నారుపోలూరులో చోరీ


బాధితుల వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

సూళ్లూరుపేట, జూలై 17: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో బుధవారం పట్టపగలు... అదీ నిత్యం జనసంచారం ఉండే ప్రాంతంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... మన్నారుపోలూరులోని గొల్లవీధిలో కాపురం ఉంటున్న పి.గోపి, శాంతి నివాసంలో మిట్ట మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాల సహా రూ.10 వేలను అపహరించారు. దంపతులిద్దరూ మన్నారుపోలూరులోనే ఉన్న ఓ వాటర్ ప్లాంట్‌లో రోజువారీ కూలీలు. ఈ క్రమంలో బుధవారం ఇంటికి తాళం వేసుకుని పనికి వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పక్కనున్న వారు ఇంటి తలుపులు తీసివేసి ఉండడంతో వెంటనే వారికి సమాచారం అందించారు. బాధితులు ఇంటికి చేరుకుని పరిశీలించారు. ఇంటికి వేసిన తాళం పగలగొట్టి బీరువాను ధ్వంసం చేసి 5 సవర్ల బంగారు నగలు, రూ.10 వేలు చోరీ చేసినట్టు గుర్తించారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీహరికోట ఎస్‌ఐ రఘునాథ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను వివరాలడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తా


ఎమ్మెల్యేకు తమ సమస్యలను వివరిస్తున్న పోలీసులు

గూడూరు, జూలై 17: గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు పోలీస్ సిబ్బంది ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నెల్లూరులో ఉంటూ గూడూరులో ఉద్యోగం చేస్తున్న పోలీస్ సిబ్బంది ఉద్యోగ రీత్యా తిరుపతి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోందని తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. నెల్లూరు దగ్గరగా ఉండడంతో గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి ఆ జిల్లాలో కలిపేలా సహకరించాలని పోలీసులు కోరారన్నారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రస్తావించి గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరు జిల్లా పరిధిలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

అర్జున తపస్సు, అగ్నిగుండ మహోత్సవాన్ని
సమన్వయంతో విజయవంతం చేద్దాం


అధికారులతో సమీక్షిస్తున్న ఈవో మూర్తి, డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 17: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నై రోడ్డులో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగే అర్జున తపస్సు, ఆదివారం జరిగే అగ్నిగుండ మహోత్సవాన్ని విజయవంతం చేద్దామని ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి అన్నారు. ఆలయ పరిపాలన భవనంలో బుధవారం పలుశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆలయం వద్ద పరిశుభ్రంగా ఉండే విధంగా పురపాలక సంఘం అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం లేకుండా చూడాలని పోలీసుశాఖను కోరారు. అదే విధంగా ఆలయం వద్ద భక్తుల కోసం ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులకు సూచించారు. ఇక అగ్నిగుండం మహోత్సవం రోజున అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఆలయ అధికారులు నూకరత్నం, మల్లికార్జున ప్రసాద్, కృష్ణారెడ్డి, సతీష్ మాలిక్, నాగభూషణం యాదవ్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి స్వాగతం


నితిన్ గడ్కరీకి స్వాగతం పలుకుతున్న మంత్రి జనార్దనరెడ్డి ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, నాని

రేణిగుంట, జూలై 17: కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం మధ్యాహ్నం డిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరున్న ఆయనకు రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి జనార్దనరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రాంతిలాల్ దండే, బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, కోలా ఆనంద్ స్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్‌లో ఏపీలో జాతీయ రహదారుల ప్రాజెక్టులపై అధికారులు, ప్రజాప్రతి నిధులతో సమీక్షించారు. ఎంపీ గురుమూర్తి, బీజేపీ నాయకులు జిల్లాలో రహదారుల నిర్మాణంపై వినతి పత్రం అందజేశారు. అనంతరం కేంద్రమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో మదనపల్లిలో జరిగే కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లారు.

చెన్నై - తిరుపతి రహదారిని విస్తరించండి

రేణిగుంట, జూలై 17: చెన్నై - తిరుపతి రహదారి విస్తరణ పనులకు సహకరించాలని కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి కోరారు. బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో కేంద్రమంత్రిని కలిసిన భానుప్రకాష్‌రెడ్డి చెన్నై - తిరుపతి రహదారిని ఆరులేన్లుగా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.

టీడీపీ నేత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


కన్నయ్య కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, జూలై 17: ఇటీవల మృతి చెందిన టీడీపీ నేత కన్నయ్య(29) కుటుంబాన్ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరామర్శించారు. పిచ్చాటూరు మండలం కొత్త గొల్లకండ్రిగ గ్రామానికి చెందిన అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. బుధవారం కన్నయ్య ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే మృతుడి భార్య తిలకావతిని పరామర్శించారు. తన భర్త చనిపోవడంతో తమ కుటుంబం వీధిన పడిందని, ఇద్దరు మూగ పిల్లలు, ఒక చంటి పిల్లాడిని ఎలా పోషించాలని తిలకావతి బోరున విలపించారు. పార్టీ, ప్రభుత్వం తరపున ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. 4వ తరగతి చదువుతున్న కన్నయ్య కుమారుడు హేమంత్ కుమార్‌ని టీటీడీ బధిర పాఠశాలలో చేర్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, నాయకులు జయచంద్ర నాయుడు, ఎంఎస్.రవి, మునిశేఖర్‌రెడ్డి, గోపి, మురళి బాబు, రమేష్ నాయుడు, గోవర్ధన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా తొలి ఏకాదశి

శ్రీకాళహస్తి, జూలై 17: తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయంలో మూలమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసిన మహిళలు దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పోలీస్‌స్టేషన్లలో ఎస్పీ తనిఖీలు


తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

శ్రీకాళహస్తి, జూలై 17: శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం తనిఖీ చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో పోలీస్‌స్టేషన్లలో అధికారులు, సిబ్బంది పని తీరుపై చాలా కాలంగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లోనే శ్రీకాళహస్తి పరిస్థితులపై ఎస్పీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. బుధవారం శ్రీకాళహస్తి వన్‌టౌన్, రూరల్, తొట్టంబేడు పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాజసూయయాగం

శ్రీకాళహస్తి, జూలై 17: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నై రోడ్డులో వెలసిన ద్రౌపతీ సమేత ధర్మరాజ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాజసూయయాగం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజసూయయాగం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేక పూజలు నిర్వహించి చప్పరాలపై అధిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించండి


ఏపీడీతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కేవీబీపురం, జూలై 17: మండలంలో పనిచేస్తున్న 20మంది ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే తొలగించాలని టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులనాయుడు, తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, టీఎన్‌టీయూసీ ప్రతినిధి జయరామిరెడ్డి ఏపీడీ ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి పనులు చేయకుండానే వైసీపీ నేతలకు ఫీల్డ్ అసిస్టెంట్లు వేలల్లో బిల్లులు పెట్టారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు నకిలీ ఖాతాలను సృష్టించుకుని పనికి వెళ్లనివారి జాబ్‌కార్డులతో వేలకు వేలు దోచుకున్నారని ఆరోపించారు.

గంగమ్మ జాతర

ఏర్పేడు, జూలై 17: ఏర్పేడు మండలం చిందేపల్లెలో గంగమ్మ జాతరను గ్రామస్తులు బుధవారం నిర్వహించారు. మంగళవారం రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు పొంగళ్లుపెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

కోరలు చాచిన 'లాటరీ భూతం'

- విచ్చలవిడిగా లాటరీ టికెట్ల అమ్మకాలు
- ఐదేళ్లుగా చట్టవ్యతిరేక కార్యకలాపాలు
- పట్టించుకోని అధికారులు



సామాజిక మాధ్యమాల్లో బుధవారం విడుదలైన లాటరీ ఫలితాలు

శ్రీకాళహస్తి, జూలై 17: శ్రీకాళహస్తి పట్టణంలో లాటరీ టికెట్ల మాఫియా జనాన్ని లూటీ చేస్తోంది. ఐదేళ్ల నుంచి విచ్చలవిడిగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో పలుచోట్ల బాహాటంగా లాటరీ టికెట్ల అమ్మకాల దందా జరుగుతోంది. నడిరోడ్డుపై మట్కా విక్రయాలు సాగిస్తుండడంతో కొందరు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఐదేళ్ల క్రితం అప్పటి అధికార పార్టీ నాయకులు లాటరీ టికెట్లను అమ్మడం ప్రారంభించారు. దీనిపై చర్యలు లేకపోవడంతో కమీషన్ల కోసం టికెట్లు అమ్మేవారు అంతకంతకు పెరిగిపోయారు. గతంలో రోజు మొత్తం అమ్మే టికెట్లకు పక్కరోజు ఫలితం ప్రకటించేలా ఆట సాగించేవారు. ఏడాది నుంచి చాలా కంపెనీల పేర్లతో విక్రయిస్తున్నారు. అది కూడా ప్రతి రెండు గంటలకు ఫలితం వచ్చేలా... రోజుకు ఐదుసార్లు ఆట అంటూ టికెట్లు అమ్ముతున్నారు. వెంటవెంటనే కావడంతో చేతికి వచ్చిన నగదు వచ్చినట్లే వ్యసనపరులు జూదానికి తగలేస్తున్నారు. పట్టణంలో కొన్ని ప్రాంతాల్లోని టీ దుకాణాలు లాటరీ, మట్కా విక్రయాలకు అడ్డాగా మారిపోయాయి. ఎక్కడ చూసినా బాహాటంగా జనం గుంపులు గుంపులుగా చేరి టికెట్లను కొనుగోలు చేస్తున్నారు. ప్రధానంగా యువత, కార్మిక వర్గాలు లాటరీ టికెట్ల కొనుగోళ్లకు ఆకర్షితులయ్యారు. దీంతో లాటరీ అమ్మకాలు విపరీతంగా పెరిగిపోయాయి. పలు రకాల లాటరీ టిక్కెట్లను వివిధ స్థాయిల ధరలతో అమ్మకాలు సాగిస్తున్నారు. కొందరు వైసీపీ నేతలు బహిరంగంగా కార్యాలయం పెట్టి లాటరీ టికెట్ల విక్రయాలు సాగించారు. దీనిపై పెద్ద ఎత్తున దుమారం రేగడంతో లాటరీ ఆఫీస్ మూసివేసి చాటుగా దందా సాగిస్తున్నారు. ఇకనైనా అధికారులు మామూళ్ల మత్తు వీడి పట్టణమంతా విషవృక్షంలా మారిపోయిన జూదాన్ని సమూలంగా పెకలించాలని ప్రజలు కోరుతున్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

రేణిగుంట, జూలై 17: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం తెల్లవారుజామున రేణిగుంట రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ రవి తెలిపిన వివరాల మేరకు... 45 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి రైలు కిందపడి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి చేతిపై బి.కుమార్, చిన్నప్ప అనే పచ్చబొట్టు ఉందని, మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యాదాఘాతంతో రెండు గేదెల మృతి

వరదయ్యపాళెం, జూలై 17: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటన వరదయ్యపాళెం మండలం సీఎల్ఎన్‌పల్లెలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత రైతులు రవిరెడ్డి, మునిరత్నం కథనం మేరకు... మేత మేయడానికి పొలాల్లోకి వెళ్లిన గేదెలు అక్కడున్న విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందాయి. వాటి విలువ రూ.1.80లక్షలు అని బాధితులు తెలిపారు. జీవనాధారమైన గేదెలను కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

భక్తిశ్రద్ధలతో మొహరం


పీర్లకు పూజలు చేస్తున్న ముస్లింలు, హిందువులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 17: మండలంలోని గాజులపెళ్లూరు, వెస్ట్‌వరత్తూరు, కాటూటరు, పీవీకండ్రిగ, పుత్తేరి, కంచనపుత్తూరు గ్రామాల్లో మొహరం పండుగను బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దర్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. ఆయా గ్రామాల్లోని చావిడిలో పీర్లను నిలిపి దూపం వేసి ప్రార్థనలు చేశారు. గ్రామస్తులు బెల్లం పానకాన్ని నైవేద్యం సమర్పించారు. పలువురు అగ్నిగుండ ప్రవేశం చేసి తమ కోర్కెలు తీరాలని మొక్కుకున్నారు. పండుగలో హిందూవులు పాల్గొని మతసారస్యాన్ని చాటుకున్నారు.

సత్యవేడు: స్థానిక నేతాజీ రోడ్డులోని పీర్లచావిడి వద్ద మంగళవారం రాత్రి భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. బుధవారం సాయంత్రం పీర్లను ప్రత్యేకంగా అలంకరించి గంధోత్సవం నిర్వహించారు. రాత్రి పీర్లను నిమజ్జనం చేశారు. ఏఎంపురంలో హిందూ, ముస్లింలు ఐక్యంగా మొహర్రం పండుగను జరుపుకుని మతసామరస్యాన్ని చాటారు.

రొట్టెల పంపిణీ

రేణిగుంట, జూలై 17: రేణిగుంట పట్టణంలోని గౌసియా ఆశ్రమంలోని దర్గాలో మొహరం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం రాత్రి టీడీపీ నేత, మాజీ సర్పంచు జ్యోతి నారాయణ, వార్డు మెంబరు ఎంజీ రెడ్డి భక్తులకు రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ పెద్దలు, టీడీపీ నాయకులు సాగర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సర్వీసుల ప్రారంభం


ఆర్టీసీ సర్వీసులను జెండాఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం, జూలై 18: నాగలాపురం నుంచి టీపీకోట మీదుగా సత్యవేడుకు రెండు ఆర్టీసీ సర్వీసులను బుధవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు నాగలాపురం నుంచి సత్యవేడుకు రెండు సర్వీసులను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే ఆర్టీసీ బస్సులో కాసేపు ప్రయాణించారు. టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, నాయకులు పార్థిబన్, విజయకుమార్, ఎండీ.కుమార్, యమున, రుద్రయ్య నాయుడు, మనోజ్ కుమార్ నాయుడు, అన్బు, తెన్నరసు, రాజారాం, బాలజి, బాలాజీరెడ్డి, మాతయ్య, జనసేన మండలాధ్యక్షుడు మనికంఠన్, బీజేపీ నాయకులు, పాల్గొన్నారు.

పిచ్చాటూరు - శ్రీరామపురం సర్వీసు పునరుద్ధరణ

పిచ్చాటూరు, జూలై 17: మండల కేంద్రమైన పిచ్చాటూరు నుంచి తమిళనాడు సరిహద్దులోని శ్రీరామపురం వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించిన ఈ సర్వీసును నాలుగేళ్ల క్రితం రద్దు చేశారు. ఈ మార్గంలోని ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటరమణతో మాట్లాడి పునః ప్రారంభించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, నాయకులు సతీష్ నాయుడు, పద్మనాభరాజు, వాసురెడ్డి, జయచంద్ర నాయుడు, పద్మరాజు, సుమాంజలి, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

యువత శ్రమదానం

వరదయ్యపాళెం, జూలై 17: వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురంలో శ్రీకాళహస్తి - చెన్నై ప్రధాన రహదారి గతంలో కురిసిన భారీ వర్షాలకు గుంతలమయంగా మారింది. వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇక్కట్లు పడేవారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించు కోలేదు. బుధవారం జనసేన, టీడీపీ, బీఎస్పీలోని యువకులు గుంతలను మట్టితో పూడ్చివేశారు. గ్రామస్తులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, యువరాజ్, శంకర్, మయూరి మహేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కేంద్రమంత్రి ఎస్పీ సింగ్ బఘేల్


ఆలయ ధ్వజస్తంభం వద్ద కేంద్ర సహాయమంత్రి

శ్రీకాళహస్తి, జూలై 17: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం కేంద్ర సహాయమంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు పూజలను చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద ఆలయ వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కండ్రిగ ఉమ, అమర్‌నాథ్, డిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

గంజి మాధవయ్యకు నేతల శుభాకాంక్షలు


గంజి మాధవయ్యను సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

పుత్తూరు అర్బన్, జూలై 17: టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆయన స్వగృహం వద్ద కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. మాధవయ్యను గజమాల, దుశ్శాలువలు, పూలబొకేలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తడుకు సర్పంచు బొబ్బిలి యాదవ్, కరుణాయాదవ్, పి.బాబునాయుడు, నర్రా మధు, డిజి.ధనపాల్, గోపిరెడ్డి, కే.హరి, ఎం.రమేష్, డి.హేమంత్‌కుమార్, పి.గణేష్, జింకా వెంకటేష్, గాలి గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

22న అప్పలాయగుంటలో పుష్పయాగం


వడమాలపేట, జూలై 17: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీ సోమవారం శ్రీవారి పుష్పయాగం నిర్వహించనున్నారు. గత నెల 17నుంచి 25వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఉత్సవాల్లో తెలిసీ తెలియక ఏవైనా పొరపాట్లు జరిగివుంటే ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈనెల 21న ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. 22న ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజనం చేపడతారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 2.40నుంచి సాయంత్రం 5గంటల వరకు పుష్పయాగం నిర్వహిస్తారు. తరువాత తిరువీధి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి శివకుమార్ తెలిపారు.

మరో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయండి


మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూలై 17: నగరి నియోజకవర్గంలో మరొక గురుకుల పాఠశాల మంజూరుకు అవకాశాన్ని పరిశీలించాలని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌కు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం అమరావతిలో మంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ గతంలో జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనేందుకు పుత్తూరు మండల పరిధిలోని గోపాలకృష్ణాపురానికి వచ్చిన నారా చంద్రబాబునాయుడు అక్కడ ఎస్టీల కోరిక మేరకు గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. నగరి నియోజకవర్గ పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఎక్కువగా ఉన్నందున వారికి మెరుగైన విద్యా సౌకర్యాల కల్పనకు మరొక గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. గాలి భానుప్రకాష్ విజ్ఞప్తులను సావధానంగా విన్న లోకేశ్ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు.

వైభవంగా గంగమ్మ జాతర



పుత్తూరు టౌన్, జూలై 17: మండల పరిధిలోని తడుకు గ్రామంలో గంగమ్మ జాతరను బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున ఆలయ పూజారులు బంకమన్ను, పసుపు, కుంకుమతో మూడు గంగమ్మల ప్రతిమను తయారు చేసి, ప్రాణప్రతిష్ఠ చేశారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామం నడివీధిలో అమ్మవార్లను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా ఏకాదశి ఉత్సవం


తిరుచ్చి వాహనంపై శ్రీవారు

నారాయణవనం, జూలై 17: మండలంలో వెలసిన పద్మావతీ సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో బుధవారం ఏకాదశి ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్యాపూజా కైంకర్యాలు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్య ఏకాదశి ప్రశస్తి గురించి వివరించారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న మాడవీధుల్లో గ్రామోత్సవంలో భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తులకు ఆస్థానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.